
J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 29.05.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 52 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## తొలి ఏడాది...
# సంక్షేమ ఉగాది!




- విజయవంతంగా ఏడాది పాలన
- నూటికి 90 శాతం మేనిఫెస్టో అమలు
- చంద్రబాబు వెళ్తూ వెళ్తూ ఖాళీ ఖజానా ఇచ్చినా ఆ లోటును కనిపించనీయని జగన్ సర్కార్

*నలభైఏళ్ల రాజకీయ అనుభవం కాని, 14ఏళ్ల పరిపాలనానుభవం కాని అసలే లేదు. ప్రపంచానికి పాఠాలు చెప్పినవాడు కాదు... బిల్‌గేట్స్‌కు కంప్యూటర్ గురించి వివరించిన మనిషి కూడా కాదు. ఒలంపిక్స్‌లో పతకాలు తెప్పించిన చరిత్ర లేదు, అరచేత్తో నడిసముద్రంలోనే తుఫాన్‌లు ఆపగలిగినంత శక్తివంతుడూ కాదు. ఇవన్నీ కాకపోయినా... ఇవన్నీ చేయకపోయినా ఏడాది పాలనలోనే ప్రజల ముఖ్యమంత్రి అనిపించుకున్నాడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి.*

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏడాది పాలన పూర్తి చేసుకున్నాడు. ఈ ఏడాది కాలంలోనే ఆయనపై రాళ్లు పడ్డాయి, పూలు పడ్డాయి. కాని ఈ తొలి ఏడాదిలోనే ఆయన తానేంటో నిరూపించుకున్నాడు. ఇచ్చిన మాట, చేసిన వాగ్దానంపై వెనక్కు తగ్గబోనని చాటుకున్నాడు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90శాతం దాకా తొలి ఏడాదిలోనే అమలు చేసి 'మాటతప్పను - మడమ తిప్పను' అని తాను చేసిన బాసను నిలబెట్టుకున్నాడు.

**ఖాళీ ఖజానా ఇచ్చినా...**

2019లో చంద్రబాబు గద్దె దిగే సమయానికి ఖజానా పూర్తిగా ఖాళీ అయ్యింది. ఓట్ల కోసం ఆయన పసుపు - కుంకుమ పేరుతోనే 29వేల కోట్లు ఇచ్చేశాడు. రాష్ట్ర విభజనతోనే రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లిపోయింది. చంద్రబాబు ఐదేళ్ల అస్తవ్యస్థ విధానాలతో అదనంగా మరో రెండున్నర లక్షల కోట్లు అప్పు పెరిగి మొత్తం రాష్ట్ర అప్పు 3.40 లక్షల కోట్లకు

(మిగతా 11వ పేజీలో)



## అమ్మాలన్నదెవరు?
# ఆపిందెవరు?

- వెంకన్నను వివాదాల్లోకి లాగిందెవరు?
- YES BANK నుండి శ్రీవారి నిధులను కాపాడిందెవరు?



*అధికారానికి దూరం కావడాన్ని మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఏడాదికే ప్రతిపక్షంలో వుండడం ఆయనకు ముళ్ల కంచె మీద కూర్చున్నట్లుగా వుంది. ఇంకో నాలుగేళ్ల ప్రతిపక్షంలోనే వుండాలి... ఆ తర్వాత కూడా ఆయన పరిస్థితేంటి? అన్నది ప్రశ్నార్థకమే!*

ఈ నిరాశా, నిస్పృహలతోనే ఆంధ్రప్రదేశ్‌లోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విషంకక్కడమే పనిగా పెట్టుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను సెంటిమెంట్ మాటలతో జగన్‌పైకి రెచ్చగొట్టడానికి నానా తంటాలు పడుతున్నాడు.

గత రెండువారాలుగా తిరుమల తిరుపతి దేవస్థానంకు సంబంధించిన నిరర్థక ఆస్తుల వేలం పెద్ద వివాదం కావడం తెలిసిందే! టిటిడి ఆస్తులను జగన్ ప్రభుత్వం అమ్మేస్తుందంటూ తెలుగుదేశం, బీజేపీ పార్టీలతో పాటు పచ్చమీడియా కూడా పెద్ద ఎత్తున రాద్ధాంతం చేసింది.

**అసలు వాస్తవం...**

గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే 2016 జనవరి 30న టిటిడి పాలక మండలి సమావేశంలో శ్రీవారికి వివిధ ప్రాంతాలలో భక్తులు మొక్కుగా ఇచ్చిన 51 ఆస్తులను వేలం వేయాలని నిర్ణయించారు. ఇవన్నీ కూడా చిన్నచిన్న స్థలాలు. వేరువేరు ప్రాంతాలలో వుంటాయి. వీటిని కాపాడడం కూడా కష్టమే! ఎందుకంటే అక్రమార్కులకు అది దేవుడి భూమైనా... స్మశాన స్థలం అయినా ఒక్కటే! ఆక్రమణలకు పోయే బదులు వున్న చిన్నచిన్న స్థలాలను వేలం వేసి వచ్చిన డబ్బును టిటిడి కార్పస్ ఫండ్‌కు జమ చేయాలనుకోవడంలో తప్పులేదు. చంద్రబాబు ప్రభుత్వంలో టిటిడి బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని ఆక్షేపించాల్సిన పనిలేదు. కాకపోతే అలా వేలం వేసి వచ్చిన డబ్బును హిందూ

(మిగతా 11వ పేజీలో)

## జగన్ జెండా ఊపితే...
# బాబు హోదా గల్లంతే!

- టిడిపి ఎమ్మెల్యేలు వస్తామంటున్నా.. వద్దంటున్న ముఖ్యమంత్రి



*చంద్రబాబు గారు... నేను గేట్లు తెరిస్తే చాలు... మీ ప్రతిపక్ష హోదా కూడా గల్లంతే! మీ పార్టీ ఎమ్మెల్యేలు మా పార్టీలోకి దూరడానికి రెడీగా వున్నారు. కాని అలా చేస్తే నీకు నాకూ తేడా ఏముంటుంది... 2019లో ఎన్నికలు ముగిసి వైసిపి అధికారంలోకి వచ్చాక జరిగిన తొలి అసెంబ్లీ సమావేశంలోనే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును ఉద్దేశించి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి.*

నిజమే.. చంద్రబాబులా జగన్ కూడా రాజకీయంగా అడ్డదారులు తొక్కివుంటే, ఆయనలా ఎమ్మెల్యేల కొనుగోలుకు పచ్చజెండా వూపుంటే చంద్రబాబు ప్రతిపక్ష హోదా తొలి సమావేశంలోనే గల్లంతై ఉండేది. తెలుగుదేశం మొన్న ఎన్నికల్లో గెలిచింది 23సీట్లు. సభలో ప్రతిపక్షహోదా ఉండాలంటే పదోవంతు సీట్లుండాలి. కాబట్టి టిడిపికి ప్రతిపక్ష హోదాకు 18సీట్లు తప్పనిసరిగా వుండాలి. ఇప్పటికే ముగ్గురు టిడిపి ఎమ్మెల్యేలు చంద్రబాబును వీడారు. సభలో కూడా ఆ ముగ్గురు ప్రత్యేకంగా కూర్చుంటున్నారు.

తాజాగా మరో నలుగురు ఎమ్మెల్యేలు తెలుగుదేశంను వీడి వైసిపిలో చేరడానికి సిద్ధమైనట్లుగా తెలిసింది. వీరిలో

(మిగతా 11వ పేజీలో)

## నాన్‌డెల్టా క్రింద.. రెండో కారు పంటలను

# ఎండబెట్టుకోవాల్సిందేనా?



గత ఏడాది కురిసిన వర్షాల మూలంగా జిల్లాలోని సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు బాగానే నిండాయి. దీనికితోడు చెరువులు, బావుల్లో నీళ్ళు పెరగడంతో నీటి సమస్య లేకుండా జిల్లాలో మొదటి కారు బాగానే పండింది. దిగుబడి కూడా బాగానే వచ్చింది.

సరిగ్గా జిల్లాలో రెండోకారు పంట వేసుకునే సమయంలో కరోనా వైరస్ మూలంగా లాక్‌డౌన్ విధించాల్సి వచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగమంతా కూడా కరోనా వైరస్ పర్యవసాన కార్యక్రమాల మీదే దృష్టిపెట్టింది. రెండో కారు పంటకు నీళ్లిచ్చే విషయంగా జిల్లా సాగునీటి సలహా కమిటి సమావేశాన్ని నిర్వహించలేకపోయింది. రెండో కారు పంట విషయంలో రైతులకు కూడా స్పష్టత లేదు.

అయితే రెండోకారు పంటకు కూడా నీళ్ళకు ఇబ్బంది లేదంటూ ఒకరిద్దరు నాయకులు, అధికారులు చెప్పిన మాటలు నమ్మి నాన్‌డెల్టా రైతులు ఈసారి రెండోకారు నారు మళ్ళు వేశారు. ముఖ్యంగా కావలి, కనుపూరు కాలువల క్రింద వేలాది ఎకరాలలో రెండోపైరు వేయడం జరిగింది. ఇటీవల కావలి కాలువకు అనధికారికంగా నీళ్ళు వదలడం కూడా రాజకీయంగా వివాదానికి దారి తీసింది. డెల్టాకు నీళ్లిచ్చిన తర్వాతే నాన్‌డెల్టాకు నీళ్లొదలాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పేర్కొనడం తెలిసిందే!

అయితే ఐఏబి సమావేశం జరక్క పోవడం, ఎలాంటి సమాచారం లేకుండానే కావలి, కనుపూరు కాలువల క్రింద రైతులు పైర్లు వేయడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఈమధ్య కలెక్టర్ కూడా నాన్‌డెల్టా ప్రాంతంలో పర్యటించి అనుమతి లేకుండా పైర్లు ఎలా వేస్తారంటూ రైతులను అరిచారు. కాని ఇప్పుడు నాన్‌డెల్టాకు నీళ్లివ్వకపోతే వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన తాము నాశనమైపోతామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


## జిల్లాలో పొగాకు రైతుల నిరసన

**- గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్**

మీరిచ్చే రేటుకి పెట్టుబడి కూడా రాదంటూ నెల్లూరుజిల్లాలో పొగాకు రైతులు నిరసన వ్యక్తం చేశారు. డీసీపల్లిలోని పొగాకు వేలం కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. అధికారుల తీరుకి నిరసనగా రోడ్డుపైనే పొగాకు బేళ్ల తగలబెట్టారు. గిట్టుబాటు ధర కల్పించాలంటూ వేలం నిర్వహణ అధికారి, బయ్యర్లను రైతులు నిలదీశారు. బోర్డు అధికారుల నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై వేలానికి తీసుకు వచ్చిన పొగాకు బేళ్ళను తగలబెట్టారు. దీంతో జాతీయ రహదారిపై దాదాపు ఐదు కిలోమీటర్ల వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హుటాహుటిన ఆత్మకూరు ఆర్డీఓ ఉమాదేవి, ఓఎస్డీ చెన్నయ్యను అక్కడకు పంపారు. అక్కడకు చేరుకున్న వారు పొగాకు బోర్డు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓఎస్డీ చెన్నయ్య మాట్లాడుతూ లాక్‌డౌన్ వల్ల దాదాపు 60రోజులు పొగాకు కొనుగోళ్లు నిలిచిపోయాయని మంత్రి మేకపాటి గౌతంరెడ్డి కృషితో మళ్ళీ పొగాకు కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట రెవిన్యూ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 30న రైతు భరోసా కేంద్రాలు

జిల్లాలో మే 30వ తేదిన రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఆనంద కుమారి ఈనెల 25న ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సేవలందించేందుకు గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులు, పశుసంవర్థకశాఖ, మత్స్యశాఖ సహాయకులను ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు.



# ఇళ్ళల్లో సెగ.. బయటికొస్తే భగభగ

- మే నెల మండిపోతోంది
- రోహిణి.. ప్రతాపమంతా చూపుతోంది



*గత కొద్దిరోజులుగా భగ్గుమంటున్న ఎండలతో రోహిణి కార్తె తన ప్రతాపమంతా చూపుతోంది. రోహిణిలో రోళ్ళు పగిలే ఎండలని పెద్దలు అంటుంటారు. అదేమిటో ఇప్పుడు తెలుస్తోంది. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె రానే వచ్చింది.*

భానుడి భగభగలతో, వేడిగాలులతో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇంతగా భగ్గుమంటున్న ఎండలను చూసి జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు ఈ ఎండలకు తాళలేక, ఉక్కపోతలు భరించలేక అల్లాడిపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విలవిలలాడుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ చుర్రుమంటోంది. మధ్యాహ్నమైతే అసలు బయటకు రాలేనంత ఎండ. ఈ మండే ఎండలు ప్రజలను అల్లాడిస్తున్నాయి. సాయంత్రం 7గంటలవుతున్నా సెగలు కొద్దిగా కూడా తగ్గడం లేదు. ఇళ్ళలో ఉంటే సెగ, బయటికొస్తే భగభగ!.. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి.

## నిప్పులు చిమ్ముతున్న ఎండలు

గతంలో 34 డిగ్రీలకే అబ్బో!.. నెల్లూరులో భలే ఎండలని ప్రజలు భయపడేవారు. ఇప్పుడు మరీ ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. పది రోజుల కిందట 37 డిగ్రీలున్న ఉష్ణోగ్రత గత కొద్దిరోజులుగా ఏకంగా 44 నుంచి 46 డిగ్రీల దాకా పెరిగిపోతుండడంతో ఈ ఎండల ధాటికి జనం బెంబేలెత్తుతున్నారు. రోహిణి కార్తె వచ్చిన తర్వాత నాలుగు రోజుల పాటు ఎండలు మరీ భగ్గుమంటాయని, వడగాడ్పులు కూడా వీచే ప్రమాదం ఉందని, ప్రజలందరూ బయటకు రాకుండా నీడపట్టున ఉంటూ ఎండవేడిమిని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖలు హెచ్చరిస్తున్నాయి. అయితే ఎండలు ఈ నాలుగురోజుల పాటు మాత్రమే కాక, ఆ తర్వాత కూడా ఇలాగే ఉండవచ్చని, నైరుతి రుతుపవనాలు వచ్చేదాకా ఈ నిప్పుల సెగ తప్పదని కూడా అంటున్నారు. నేటికీ ఎండలు మిడిమేళంగా కాస్తూనే ఉన్నాయి. ఈ భగభగలు ఇంకా ఎన్నాళ్ళు భరించాలో మరి!... అయినా!.. ఒకవైపు కరోనా భయంతో ప్రజలు అదిరిపోతుంటే, మరోవైపు మూలిగే నక్కమీద నిప్పుల కుంపటి పడ్డట్లు.. ఏం ఎండలో ఏమో!.. జనాన్ని బతకనిచ్చేట్లు లేవు!..



# వెంకయ్యకు ప్రధాని ప్రశంసలు

ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకంగా కొనియాడారు. ఉపరాష్ట్రపతి అంటే ఏ పనీపాటా వుండదని, గుళ్లు, గోపురాలు తిరుగుతుండడమే ఆ పదవుల్లో వున్నవారికి పెద్ద పని అనే ఒక దురభిప్రాయం సమాజంలో వుండేది. ఉపరాష్ట్రపతిగా తన పదవీ కాలంలో తన పనితీరు ద్వారా వెంకయ్యనాయుడు ఆ అభిప్రాయాన్ని మార్చి వేశాడు. ఒక ఉపరాష్ట్రపతి దేశానికి ఎన్ని రకాలుగా సేవలు చేయొచ్చో చేసి చూపిస్తున్నాడు. ముఖ్యంగా ఈ కరోనా కష్టకాలంలో ఆయన ఓ పక్క లాక్‌డౌన్ నిబంధనలు పాటిస్తూనే మరోపక్క కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా అన్ని ప్రాంతాల వారితో, అన్ని వర్గాల వారితో మాట్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. తన చిన్నతనం నుండి నేటివరకు పరిచయమైన ఎందరినో ఫోన్ ద్వారా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఒక గొప్ప సంస్కృతిని నెలకొల్పాడు. ఈ కరోనా కాలంలో ఉపరాష్ట్రపతిగా వెంకయ్య చూపిన చొరవ, అన్ని ప్రాంతాల ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఆయన పడ్డ తపనను ప్రధాని నరేంద్ర మోడీ ఎంతగానో మెచ్చుకుని ట్విట్టర్ ద్వారా వెంకయ్యకు అభినందనలు తెలిపారు.

# అనిల్‌ను కలిసిన సిద్ధార్థ్



తన ఉపన్యాసాలతో యువతను ఉర్రూతలూగిస్తున్న కర్నూలుజిల్లా వైసిపి యువ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి 25వ తేదీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశాడు. పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. వైసిపి నెల్లూరురూరల్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా వారి వెంట వున్నాడు.

## కరోనా కష్టాల్లో వున్నాం.. ఆదుకోండి!



కరోనా మూలంగా ఇబ్బందులు పడుతున్న జిల్లాలోని విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని కోరుతూ మే 26వ తేదీన నెల్లూరు సంతపేటలోని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెంకటశేషయ్య ఆచారి మరియు కార్యవర్గ సభ్యులు, పక్కన వైసిపి నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి.

## సీతమ్మకు నివాళి



అమ్మ 'సీతమ్మ' ఆకస్మిక మృతితో
శోకంతో వున్న మా ఆప్తమిత్రుడు కోర్సపాటి శ్రీధర్‌కి
వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుకుంటూ...
సీతమ్మ గారికి మా కన్నీటి నివాళి.
- మిత్రులు

## 'ప్రభా'తం

# డ్రాగన్ కుట్రలు



ఆసియా ఖండంలో పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలను భారత్‌కు వ్యతిరేకంగా మార్చి, తన ఆధిపత్యం దెబ్బతినకుండా చూసుకోవాలనేది చైనా పన్నాగం! కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల్లో భారత్ మార్కెట్లోకి ప్రవేశించాలని చైనా చేసిన ప్రయత్నాలను మోడీ సర్కార్ బలంగా అడ్డుకుంది. దీనికితోడు యూరప్ దేశాలు పెట్టుబడుల ఉపసంహరణ మొదలుపెడితే చైనాకు ఆర్థికంగా తిరోగమనమే! కాబట్టి భారత్‌ను తమకు ప్రత్యామ్నాయం కాదని ప్రపంచ దేశాలకు చూపేందుకే.. భారత సరిహద్దుల్లో వివాదాలను, యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తూ చైనా కుట్రలు సాగిస్తోంది!

ప్రపంచ దేశాలన్నీ ఒక దారిలో వెళ్తుంటే, చైనా మాత్రం ఇంకో దారిలో వెళ్తుంది. ఈ ప్రపంచంతో నాకేం సంబంధం లేదు, ఈ ప్రపంచ మానవాళి నాశనం అయిపోయినా పర్వాలేదు... మేము మాత్రం అగ్రరాజ్యంగా ఎదగాలి అనే ధోరణిలో ఆ దేశ దూకుడు ఉంది. కమ్యూనిజం ముసుగులో పెట్టుబడిదారి పోకడలతో అమెరికాకు దీటుగా ఎదగాలనే ఈ ప్రయత్నంలో సరిహద్దు దేశాలతో సరిహద్దు వివాదాలతో పేచీలకు దిగుతోంది. ఇప్పటికే కరోనా వైరస్ సృష్టికర్తగా అంతర్జాతీయంగా అపఖ్యాతిని మూటగట్టుకున్న ఈ కమ్యూనిస్టు దేశం, తన అప్రతిష్ఠ పోగొట్టుకోవడానికి సరికొత్త కుట్రలకు తెర తీస్తోంది.

ఈరోజు 200కు పైగా దేశాలు కరోనా వైరస్ మూలంగా అటు ఆరోగ్య పరంగాను, ఇటు ఆర్థికపరంగానూ దెబ్బతిన్నాయంటే దానికి మూలకారణం చైనా దేశం. కరోనా వైరస్ పుట్టినిల్లు చైనా. ఇప్పటికే ఆ వైరస్ సృష్టిపై ప్రపంచ దేశాలకు అనేక అనుమానాలున్నాయి. అమెరికా అయితే చైనాయే కరోనా వైరస్‌ను సృష్టించిందని ప్రగాఢంగా నమ్ముతోంది. ఈమేరకు దర్యాప్తుకు కూడా డిమాండ్ చేసి, ప్రపంచ ఆరోగ్యసంస్థను ఒప్పించ గలిగింది. యూరప్ దేశాలన్నీ కూడా చైనాపై తీవ్రస్థాయిలో కన్నెర్ర చేస్తున్నాయి. ఆ దేశాలన్నీ కూడా చైనా నుండి తమ పెట్టుబడుల ఉపసంహరణకు శ్రీకారం చుట్టాయి. జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు చైనా మీద తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తాయి. ప్రపంచంలో పది మిత్రదేశాలు తప్పితే మిగతా దేశాలన్నీ కూడా చైనాకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ దేశాలన్నీ కూడా ఆసియా ఖండంలో చైనాకు ప్రత్యామ్నాయ దేశంగా ఎదుగుతున్న భారత్ వైపు తమ దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలు భారత్‌లో పెట్టుబడులకు తమ సంసిద్ధతను తెలియజేశాయి. భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు చైనాని వదిలి రావడానికి తయారవుతున్నాయి.

తానొకటి తలిస్తే - దైవం ఇంకొకటి తలచినట్టు.. చైనా ఒకటి అనుకుంటే.. కరోనా వైరస్ మూలంగా ఇంకోటి జరుగుతోంది. చైనా పన్నాగాలు త్వరగా బయటపడడంతో ఆ దేశానికి పాలుపోని పరిస్థితి ఏర్పడింది. కరోనా వైరస్ మూలంగా ఏర్పడిన పరిస్థితులను భారత్ ఎక్కడ అవకాశాలుగా మలచుకుంటుందోననే దుర్బుద్ధితో చైనా కొత్త కుయుక్తులకు పాల్పడుతోంది.

భారత్‌తో సరిహద్దు వివాదాలను తిరగదోడుతోంది. ఇటీవల ఇరు దేశాల సరిహద్దు లద్దాక్ వద్ద ఇరు దేశాల సైనికులు బాహాబాహీకి దిగడం జరిగింది. భారత్‌లోకి చొరబడ్డానికి ప్రయత్నించిన చైనా ఆర్మీని భారత సైన్యం అడ్డగించడం, ఇరు దేశాల సైనికుల మధ్య తోపులాట జరగడం, ఆ తర్వాత ఇరు దేశాలు కూడా ఆ ప్రాంతంలో భారీగా సైనికులను, యుద్ధ విమానాలను మోహరించడం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. కొన్నేళ్ళ క్రితం డోక్లాం ప్రాంతంలో కూడా ఇరు దేశాల సైనికుల మధ్య వివాదం జరగడం తెలిసిన విషయమే! ఎంతో కాలంగా చైనా భారత్‌పై విషం చిమ్ముతూనే ఉంది. 1962లో భారత్‌పై దురాక్రమణకు పాల్పడి కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడం తెలిసిందే! ఆరోజు ప్రధానిగా ఉన్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేతగానితనం వల్ల భారత భూభాగాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈరోజు ఆ పరిస్థితులు లేవు. చైనాకు ధీటైన జవాబు ఇచ్చేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమెరికాతో సహా అగ్రరాజ్యాలు భారత్‌కు పూర్తిగా మద్దతు పలుకుతున్నాయి. ఈ పరిణామాలను గమనించే చైనా భారత్‌తో నేరుగా పెట్టుకోకుండా, ఇప్పుడు భారత్‌పైకి పొరుగు దేశాలను ఎగదోస్తోంది. పాకిస్తాన్‌ను ఇప్పటికే తన పెంపుడు కుక్కగా మార్చుకొని భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న చైనా, ఇప్పుడు నేపాల్‌ను కూడా భారత్‌పైకి ఉసిగొలుపుతోంది. భారత్‌కు, నేపాల్‌కు మధ్య సంప్రదాయ సంబంధాలున్నాయి. భౌగోళికంగా దేశాలు వేరైనా, ఈ రెండు దేశాల జీవన విధానాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు ఒకే విధంగా ఉంటాయి. అయితే నేపాల్లో కొన్నేళ్ల క్రితం పుట్టిన కమ్యూనిజం అనే విష బీజం వలన ఆదేశం చైనా ట్రాక్‌లోకి వెళ్ళిపోయింది. ఎప్పుడూ లేని విధంగా నేపాల్ ప్రధాని భారత సరిహద్దు వివాదాన్ని లేవనెత్తడం వెనక చైనా ప్రోత్సాహం ఎంతైనా ఉంది. గత కొన్నేళ్లుగా ఏ రోజూ నేపాల్ పాలకులు భారత్‌తో వివాదాస్పదంగా వ్యవహరించలేదు. అక్కడ ఎప్పుడైతే కమ్యూనిజం ఉద్భవించిందో అప్పటినుండే ఆ దేశం చైనాతో చేరి భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మొదలుపెట్టింది.

ఆసియా ఖండంలో పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలను భారత్‌కు వ్యతిరేకంగా మార్చి, తన ఆధిపత్యం దెబ్బతినకుండా చూసుకోవాలనేది చైనా పన్నాగం! కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల్లో భారత్ మార్కెట్లోకి ప్రవేశించాలని చైనా చేసిన ప్రయత్నాలను మోడీ సర్కార్ బలంగా అడ్డుకుంది. అంతేగాక స్వదేశీ వస్తువులను వాడాలని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుతో చైనా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీనికితోడు యూరప్ దేశాలు పెట్టుబడుల ఉపసంహరణ మొదలుపెడితే చైనాకు ఆర్థికంగా తిరోగమనమే! కాబట్టి భారత్‌ను తమకు ప్రత్యామ్నాయం కాదని ప్రపంచ దేశాలకు చూపేందుకే.. భారత సరిహద్దుల్లో వివాదాలను, యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తూ చైనా కుట్రలు సాగిస్తోంది!

## ముస్లింలకు రంజాన్ తోఫా



కరోనా కష్టకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు నెల్లూరుజిల్లా జనసేన పార్టీ నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుతో ఈనెల 24న ఆయన నెల్లూరులో పండుగకు అవసరమైన సరుకులను ముస్లింలకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్‌తో ఉపాధి లేక ఆర్థికంగా సతమతమవుతున్న నిరుపేద ముస్లింలకు అండగా నిలవాలని పవన్ కళ్యాణ్ సూచించారని, అందుకే నెల్లూరులో వెయ్యిమంది ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మేకల ప్రవీణ్, కత్తి తిరుమల, మంచికంటి శ్యాం, సతీష్, ఉదయ్, శేషయ్య, గయాజ్, రమేష్, జీవం, మస్తాన్ పాల్గొన్నారు.

## వలస కూలీలకు ఆహారం

కావలిలోని మద్దూరుపాడు వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న వలస కూలీలకు స్థానిక సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. గత పదిరోజులుగా ఆ సంస్థవారు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్ర దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

### కామాక్షితాయికి
## వడాయితి ఉత్సవం

నెల్లూరు, జొన్నవాడ కామాక్షితాయి సమేత శ్రీ మల్లిఖార్జునస్వామి వార్లకు ఈనెల 24న తొలిరోజు వడాయితి ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు కుంభహారతి, ఊయల సేవ, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చీమల రమేష్‌బాబు, ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### చెంగాళమ్మ పరమేశ్వరికి
## శీతలయాగం

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరీ అమ్మవారికి ఈనెల 24న శీతలయాగం నిర్వహించారు. కరోనా నివారణార్థం ఈనెల 23 నుంచి దేవస్థానంలో రోజుకో యాగం చొప్పున నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణంలోని యాగశాలలో అమ్మణ్ణి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి శీతల యాగాన్ని నిర్వహించారు.




## పాస్టర్‌లపై ఫిర్యాదులు చేయండి

క్రైస్తవ మతంలోకి మారిన దళితులెవరైనా ఎస్సీ రిజర్వేషన్స్ కోల్పోతారు. బీసీలుగా పరిగణించబడతారు. చాలామంది దళితులు క్రైస్తవులుగా మారి కూడా ఎస్సీ రిజర్వేషన్‌లను అనుభవిస్తున్నారు. వీరివల్ల హిందూ దళిత సోదరులు అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు చాలామంది పాస్టర్‌లు ప్రభుత్వమిచ్చే 5వేల వేతనాన్ని అందుకుంటున్నారు. వీళ్ల వివరాలు ప్రతి గ్రామంలోనూ నమోదు చేయబడి వుంటాయి. ఇలాంటి వారి రికార్డెడ్ వివరాలతో తహశీల్దార్ ఆఫీసుల్లో ఫిర్యాదులు చేసి వారి రిజర్వేషన్‌లు తొలగించడానికి, ఎస్సీ హోదాను తొలగించడానికి హిందూ సోదరులు కృషి చేయాలి. దళిత హిందూ సోదరులు కూడా ఈ భోగస్ దళిత రిజర్వేషన్ అనుభవదారుల ఆట కట్టించడానికి సహకరించాలి.

సి. రాజీవి, నెల్లూరు.

## ఈ రోడ్లు బాగుపడేదెప్పుడు?

నెల్లూరు నగరంలో రోడ్లు ఇంకా అధ్వాన్నంగానే ఉన్నాయి. ఎప్పటికప్పుడు బాగు చేస్తామంటున్నారే గాని బాగుపడింది లేదు. నగరంలోని వేదాయపాలెం, కరెంట్ ఆఫీసుసెంటర్, పొదలకూరురోడ్డు ప్రాంతాల్లోని క్రాస్ రోడ్లలో పలు వీధుల్లో వున్న రోడ్లు చాలా అస్తవ్యస్థంగా వున్నాయి. చిన్న వానొచ్చినా రోడ్లమీద కంకరంతా లేచిపోయి నడవడానికి కూడా ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. దయచేసి సంబంధిత అధికారులు వానా కాలం రాకముందే ఈ రోడ్లను పరిశీలించి బాగు చేయాలని కోరుకుంటున్నాము.

ఎం.ఎస్. రావు, నెల్లూరు.

## కోతుల బెడద

నెల్లూరు పొదలకూరురోడ్డు, డైకస్‌రోడ్డు సెంటర్, ఎన్‌సిసి కాలనీ 3వ వీధిలో కోతుల బెడద ఎక్కువగా ఉంటోంది. దాదాపు ఒక్కసారిగా 20కోతులు ఇళ్ళలోకి వచ్చి వస్తువులను తీసుకెళ్ళడం, చెట్లను ధ్వంసం చేయడం చేస్తూ అదిలించినవారిపైకి దూకుతున్నాయి. సంబంధిత అధికారులు వీటి బెడద నుండి కాపాడాలి.

ఎన్‌సిసి కాలనీవాసులు, నెల్లూరు.

# ఉదయగిరి... ఇక జలసిరి కానుందా?



- దీర్ఘకాల సమస్యపై దృష్టిపెట్టిన ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు
- ఉదయగిరి నీటి ఎద్దడిపై సీనియర్ అధికారులతో సమాలోచన
- నీటి ఎద్దడి పరిష్కరించే దిశగా కేంద్ర జలశక్తి మంత్రి, నీతి అయోగ్ సి.ఇ.ఓకు సూచనలు
- ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డితోనూ ఫోన్‌లో మాట్లాడిన వెంకయ్య
- వెంకయ్య విజ్ఞాపనపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్



భారత ఉపరాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు... దాదాపు 50 ఏళ్ళ రాజకీయ ప్రస్థానం ఆయనది. 42ఏళ్లు వెనక్కు వెళితే ఆయన రాజకీయ విజయ ప్రస్థానం మొదలైంది ఉదయగిరి నియోజకవర్గం నుండే! వెంకయ్యది వెంకటాచలం మండలం చౌటపాలెం. కాని ఆయన రాజకీయ ప్రయాణం మొదలైంది 1978లో ఉదయగిరి నుండి జనసంఘ్ అభ్యర్థిగా. 1978లో రాష్ట్రమంతా కాంగ్రెస్ ప్రభంజనం వీచింది. కాని ఉదయగిరిలో వెంకయ్య అఖండ విజయం సాధించారు. 1983లో రాష్ట్రమంతా ఎన్టీఆర్ ప్రభంజనం.. కాని ఉదయగిరిలో బీజేపీ అభ్యర్థిగా వెంకయ్య భారీ గెలుపు... ఆయన రాజకీయ జీవితంలో ఈ రెండు విజయాలు చిరస్మరణీయం. ఈ విజయాలే ఆయనకు ఉదయగిరి ప్రాంతంతో అనుబంధాన్ని పెంచాయి. భారత ఉపరాష్ట్రపతి హోదాలో వున్నా కూడా ఈ ప్రాంతాన్ని, ఈ ప్రాంత ప్రజలను ఆయన మరచిపోలేదు. ఈ కరోనా కష్టకాలంలో అయితే ఎంతో మంది ఉదయగిరి వాసులను ఆయన ఢిల్లీ నుండే ఫోన్ ద్వారా పలుకరించారు. ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉదయగిరి ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి సమస్య గురించి తెలుసుకుని వెనువెంటనే స్పందించారు.

ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యల పరిష్కారంపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు దృష్టిపెట్టారు. ఈ సమస్యపై అధ్యయనం చేయాలని కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఆయన సూచించారు. ఈ నెల 25వ తేదీ సోమవారం తన నివాసంలో నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి కార్యదర్శి యూపీ సింగ్, కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి పరమేశ్వరన్ అయ్యర్‌తో జరిపిన సమావేశంలో ఉదయగిరి ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను ప్రస్తావించారు. కరువుపీడిత ప్రాంతమైన ఉదయగిరికి తాగు, సాగునీటిని అందించే సాధ్యాసాధ్యాలపై ఆయన వారితో చర్చించారు.

ఉదయగిరికి నీటిని అందించేందుకు సాంకేతిక సంభావ్యత (టెక్నికల్ ఫీజిబిలిటీ), సవివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) అంశాలపై చర్చించాలని అధికారులకు ఉపరాష్ట్రపతి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నీటి కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల పని తీరును కూడా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. జల్‌శక్తి మంత్రిత్వ శాఖ అధికారులు, నీతి ఆయోగ్ అధికారుల బృందం ఉదయగిరిలో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడితే వాస్తవ పరిస్థితిని సరిగ్గా అంచనా వేసేందుకు వీలవుతుందన్నారు. దీనికి అధికారులు స్పందిస్తూ.. లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత, వీలుచూసుకుని తప్పక ఉదయగిరిలో పర్యటిస్తామని, అక్కడి ప్రజల నీటి సమస్యను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదించి.. సరైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు. పర్యటన అనంతరం తదుపరి వివరాలతో మరోసారి కలుస్తామని ఉపరాష్ట్రపతికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి కార్యదర్శి ఐవీ సుబ్బారావు కూడా పాల్గొన్నారు.

### జగన్‌తో మాట్లాడిన వెంకయ్య

అనంతరం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనూ ఉపరాష్ట్రపతి ఫోన్లో మాట్లాడారు. ఉదయగిరి ప్రజలు తనతో పంచుకున్న తీవ్ర నీటి ఎద్దడి అంశాన్ని, జల్‌శక్తి సీనియర్ అధికారులు, నీతి ఆయోగ్ సీఈవోతో జరిగిన సమావేశం వివరాలను జగన్‌కు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ఉదయగిరి సమస్యకు పరిష్కారం లభించవచ్చని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సీఎం జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. కేంద్రంతో కలిసి పనిచేస్తూ ఉదయగిరికి నీటి సమస్య పరిష్కారానికి చొరవతీసుకుంటామని ఉపరాష్ట్రపతికి హామీ ఇచ్చారు.

### మెట్ట కుదుటపడుతుందా?

ఎన్నో ఏళ్ళుగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య తాగునీళ్ళు, సాగునీళ్ళే! సోమశిల జలాశయం నుండి జిల్లాలో అన్ని ప్రాంతాలకు నీళ్ళు వెళ్ళినా ఉదయగిరికి రావు. వెలుగొండ పూర్తయితే ఈ ప్రాంతానికి కొంత ఉపశమనం కలగొచ్చు. అలాగే సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే కొంత వరకు ఇబ్బందులు తొలగుతాయి. ఇప్పుడు వెంకయ్యనాయుడు చూపిన చొరవ, సీఎం జగన్ చూపిన సానుకూలత వల్ల ఉదయగిరి నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావచ్చు.

# మొదటివారం నుండైనా... మొదలయ్యేనా?

- ఇంకా నెలకొనని సాధారణ స్థితి
- కొలిక్కిరాని జోన్‌ల పరిధి

***లాక్‌డౌన్ విధించి రెండు నెలలు దాటిపోయింది. ప్రతిరోజూ కర్ఫ్యూ వాతావరణమే. లాక్‌డౌన్ కాలానికి తగ్గట్లు ఎండలు కూడా మండిపోతున్నాయి కాబట్టి జనం కూడా ఇళ్ళ నుండి బయటకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కాబట్టి ఒకరకంగా లాక్‌డౌన్ జనానికి కూడా మేలు చేసినట్లే!***

రెండు నెలలుగా జిల్లాలో అన్ని రంగాలు స్థంభించిపోయాయి. సడలింపుల సమయాలలో తప్పితే మిగతా అన్ని సమయాలలో నిత్యావసరాలు, కూరగాయలు వంటి అమ్మకాలు బంద్ చేస్తూ వచ్చారు. మిగిలిన అన్ని వ్యాపారాలు రెండు నెలల నుండి శాశ్వతంగా మూతే!

ఇటీవల సడలింపులు పెంచుకుంటూ వస్తున్నారు. ఉదయం 7గంటల నుండి రాత్రి 7 గంటల దాకా ప్రావిజన్స్, ఫ్యాన్సీ షాపులు తెరుచుకోవడానికి అవకాశమిచ్చారు. హోటల్స్, క్యాంటీన్‌లు, కొన్ని స్వీట్స్ అండ్ బేకరీ దుకాణాలకు కూడా అనుమతినిచ్చారు. అయితే వీటిలో పార్శిళ్ళు మాత్రమే తీసుకొనిపోవాలి. లాడ్జిలు, మాల్స్, సినిమాహాల్స్, ఆటోమొబైల్ షాపులు, సెల్‌ఫోన్ షాపులు, బుక్‌షాపులు, చెప్పుల అంగళ్ళు వంటి వాటికి ఇంకా అనుమతి ఇవ్వలేదు. సొంత కార్లలో తిరగడానికి అనుమతినిచ్చారు గాని ఇంకా ఆటోలకు పచ్చజెండా ఊపలేదు.

రెడ్‌జోన్‌లో కాకుండా మిగతా అన్ని ప్రాంతాల్లో వ్యాపార కార్యక్రమాలు యధావిధిగా కొనసాగించుకోవచ్చని చెప్పి వున్నారు.



కాని నెల్లూరులో చూస్తే ఎక్కడ షాపులు తీసుకోవచ్చో, ఎక్కడ తీయకూడదో తెలియక జనం తికమక పడుతున్నారు. నెల్లూరు నగరం పరిధిలో కేసులు చాలావరకు తగ్గుముఖం పట్టి, డిశ్చార్జ్‌లు జీరో కావొచ్చే దశలో 'కోటమిట్ట' ప్రాంతంలో కొత్తగా కేసులు రావడం జరిగింది. నగరంలో కోటమిట్ట, ఇక ఒకటి అరా ప్రాంతాలు తప్పితే ఇంకెక్కడా కేసులు లేవు. ప్రభుత్వం కూడా కేసులువున్న ప్రాంతం నుండి అరకిలోమీటరు పరిధిలో ఆంక్షలు విధించి మిగతా ప్రాంతాలలో శుభ్రంగా వ్యాపారాలు చేసుకోమని చెప్పింది.

కాని నగర పరిధిలో ఏ ప్రాంతం ఏ జోన్‌లో వుందన్న విషయాన్ని అధికారికంగా ఖరారు చేయకపోవడం, ఆయా జోన్‌లకు హద్దులు ఏర్పాటు చేయకపోతుండడం వల్ల, నెల్లూరు వ్యాపారులు సడలింపులను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.




## నెల్లూరు కబుర్లు

### లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్‌గవర్నర్‌గా
## బయ్యా రవి



శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాస రావు(వాసు) సోదరుడు బయ్యా రవి కుమార్ లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్‌గవర్నర్‌గా ఎన్నికయ్యాడు. లయన్స్ డిస్ట్రిక్ట్ - 316జె పరిధిలోకి నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు వస్తాయి. బయ్యా రవి లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలలో గత కొన్నేళ్లుగా ఎంతో చురుకుగా పాల్గొంటున్నారు. తమ తండ్రి బయ్యా రమణయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా ప్రతి యేటా సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. తనను ఈ పదవికి ఎన్నుకున్నందుకు లయన్స్ మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

## అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి
### - సిపిఐ, సిపిఎం నాయకుల వినతి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలంటూ సిపిఐ, సిపిఎం నాయకులు ఈనెల 23న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కావలిలో అగ్రిగోల్డ్ బాధితులు రెండురోజులుగా చేస్తున్న దీక్షల శిబిరంలో సిపిఐ నాయకుడు దామా అంకయ్య పాల్గొని మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేవూరు కొండయ్య, తాళ్ళూరి మాల్యాద్రి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకుడు గడ్డం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు సువర్ణావకాశం
### - విద్యుత్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలకు రాష్ట్రప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడిసిఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి కోరారు. జిల్లాలోని పరిశ్రమల వినియోగదారులకు జిల్లా పరిశ్రమల శాఖ జారీచేసిన సర్టిఫికెట్‌ను విద్యుత్ సర్వీస్‌కు అనుసంధానం చేసేందుకు విద్యుత్ అధికారులకు సంబంధిత పత్రాలను సమర్పించాలని సూచించారు. పరిశ్రమల స్థిర డిమాండ్ చార్జీల రద్దు, వాయిదా కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## సంతపేట ఎస్ఐ... విఆర్‌కు

నెల్లూరు సంతపేట ఎస్ఐ వెంకటరమణను విఆర్‌లో రిపోర్టు చేయాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారులు ఈనెల26న ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనా పరమైన అంశాల్లో భాగంగా ఆయన్ను విఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.

## పెన్నా బ్యారేజీ టెండర్లు పూర్తి
### - ఇక త్వరలోనే పనులు ప్రారంభం

పెన్నా బ్యారేజీ నిర్మాణంలో మిగిలివున్న పనులకు టెండర్లు పూర్తయ్యాయని, వీలైనంత త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని టిజిపి ఎస్ఇ హరినారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 11న తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు 93.92 కోట్ల రూపాయల అంచనాలతో టెండర్లు ఆహ్వానించగా, రెండు సంస్థలు అందుకు పోటీపడ్డాయని, ఎల్-1గా 2.45 శాతం ఎక్కువతో ఓ సంస్థ నిలిచిందని, దీనికి సంబంధించి రివర్స్ టెండరింగ్ ఈనెల 22వ తేది రాత్రి జరగ్గా, రెండు సంస్థలు పోటీపడడం, ఒక సంస్థ 1.64 శాతం తక్కువకే పనులు దక్కించుకోవడం జరిగిందని, దీంతో ప్రభుత్వానికి 3.84 కోట్ల రూపాయలు ఆదా అయిందని ఆయన వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అక్టోబర్‌లోపు బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

### ఇంటర్‌బోర్డు ఆర్ఐఓగా
## మాల్యాద్రిచౌదరి



ఇంటర్‌బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ఇరువూరు మాల్యాద్రిచౌదరి నియమితులయ్యారు. ఇంటర్‌బోర్డు కార్యదర్శి రామకృష్ణ నుంచి జిల్లా కార్యాలయానికి తాజాగా ఈ ఉత్తర్వులందాయి. ప్రస్తుతం ఆర్ఐఓగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్నారు.

### రోడ్లపై చెత్త వేశారో..
## దుకాణం బంద్
### - వ్యాపారులకు హెల్త్‌ఆఫీసర్ హెచ్చరిక

వ్యాపారులు తమ దుకాణాల వద్ద రోడ్లపై చెత్త వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని, దుకాణాన్ని సీజ్ చేస్తామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ గట్టిగా హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని విఆర్‌సి సెంటర్, గాంధీ బొమ్మ, ట్రంకురోడ్డు తదితర ప్రాంతాల్లో ఈనెల 26న ఆయన పర్యటించి దుకాణాల పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రతను పరిరక్షించుకోవాలని ఆయన దుకాణాదారులను కోరారు. దుకాణదారులు తప్పనిసరిగా శానిటైజర్లు, మాస్కులను వినియోగించాలన్నారు.

## జూన్ 1 నుంచి డ్రైవింగ్ లైసెన్సులు

లాక్‌డౌన్ నేపథ్యంలో నిలిచిపోయిన ఎల్ఎల్ఆర్‌లు, డ్రైవింగ్ లైసెన్సులను జూన్ 1 నుంచి జారీ చేయనున్నారు. కరోనా నేపథ్యంలో ఎక్కువ మంది గుమికూడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రోజుకు 30ఎల్ఎల్ఆర్‌లు, 20 డ్రైవింగ్ లైసెన్సులు మాత్రమే జారీ చేయాలని రవాణాశాఖ కమిషనర్ సీతారామాంజనేయులు రవాణా అధికారులను ఆదేశించారు.

# నెల్లూరులో తిరుమల శ్రీవారి ప్రసాదం
### - మొదటిరోజే 20 వేల లడ్లు విక్రయం



కరోనా మహమ్మారి వల్ల లాక్‌డౌన్ విధించడంతో తిరుమల శ్రీవారి ఆలయానికి భక్తుల రాకపోకలను టీటీడీ బోర్డు రద్దు చేయడంతో గత 62 రోజులుగా భక్తులకు శ్రీవారి దర్శనం నిలిచిపోయింది. ఈ క్రమంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలోని టీటీడీ కళ్యాణ మండపాలు, సమాచార కేంద్రాల్లో లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచారు. నెల్లూరు నగరం దర్గామిట్ట టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీవారి లడ్డూలను భక్తులకు ఈనెల 25 నుండి పంపిణీ చేస్తున్నారు. తొలిరోజే కళ్యాణ మండపానికి వచ్చిన 20 వేల లడ్లు సాయంత్రానికల్లా అమ్ముడు పోయాయి. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు లడ్డూ ప్రసాదాలను టీటీడీ అధికారులు పంపిణీ చేస్తున్నారు. చిన్నలడ్డు ధర రూ.25లు, పెద్ద లడ్డు ధర రూ.100లు చొప్పున విక్రయిస్తున్నారు. రెండవ రోజు 10 వేలు, మూడవ రోజు 10 వేల లడ్డూలను విక్రయించారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్

ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగను ఈనెల 25న జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో ప్రార్థనలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ సయ్యద్ అబూబకర్ ఆష్రఫి సాబిరి తన నివాసంలో మాట్లాడుతూ పరిమిత సంఖ్యలో వచ్చిన భక్తులకు రంజాన్ పండుగ సందేశం తెలియజేశారు. ఇస్లాం శాంతికి చిహ్నమని, ఖురాన్ మానవాళిని సన్మార్గం వైపు నడిపిస్తుందని అంటూ ప్రపంచమంతటా శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం అందరూ సామాజిక దూరం పాటిస్తూ ఈద్ ముబారక్ అంటూ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ఒకే స్కూటర్ పై 6 మంది
### - కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు



నెల్లూరులో ప్రమాదభరితంగా ఒకే స్కూటర్ పై ఆరుమంది ప్రయాణిస్తుండగా పోలీసులు వారికి వినూత్నంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. రైల్వే స్టేషన్ సమీపంలో దంపతులతో పాటు నలుగురు పిల్లలు స్కూటర్‌పై ప్రమాద భరితంగా వెళుతుండగా ట్రాఫిక్ పోలీసులు గమనించారు. వారిని ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. వినూత్నంగా రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ స్కూటర్ పై వారు చేస్తున్న ప్రయాణం ఎంత ప్రమాదకరమైందో వివరించారు. జరగరానిది జరిగితే కుటుంబం ఏమైపోతుందని కౌన్సిలింగ్ ఇవ్వడంతో మరోసారి ఈ విధంగా ప్రయాణించబోమని వారు బదులిచ్చారు.

## రక్తదానంపై అవగాహన అవసరం
### - వియస్‌యు రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి

రక్తదానంపై అందరికీ అవగాహన అవసరమని, రక్తదానమంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనని వియస్‌యు రిజిస్ట్రార్ డా. విజయకృష్ణారెడ్డి అన్నారు.

నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో వియస్‌యు జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ కారణంగా రెడ్‌క్రాస్‌లో రక్తనిల్వలకు కొరత ఏర్పడిందని, ఫలితంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు, క్యాన్సర్ రోగులు, గర్భిణులు ఎంతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, దీంతో తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం రక్తదాతల నుంచి 60 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో వియస్‌యు కళాశాల ప్రిన్సిపాల్ సుజానాయర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, వియస్‌యు ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ, రెడ్‌క్రాస్ సిబ్బంది రవి, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### పీజీ రీవాల్యుయేషన్ గడువు
## జూన్ 6 వరకు పొడిగింపు

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విడుదల చేసిన పీజీ ప్రొఫెషనల్ కోర్సుల ఫలితాల రీవాల్యుయేషన్ గడువును జూన్ నెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు వీఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి సాయిప్రసాద్‌రెడ్డి ఈనెల 26న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు తమ అప్లికేషన్లను ఆయా కళాశాలల్లో ఇవ్వాలని కోరారు.

# పదోళ్లకు అన్నివిధాలా పరీక్షలే!



***2020... టెన్త్ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు ఇదొక మరుపురాని సంవత్సరం. కరోనా నామ సంవత్సరం. ప్రతియేటా టెన్త్ విద్యార్థులకు ప్రశ్నాపత్రాల రూపం లోనే పరీక్షలు జరుగుతుంటాయి. కాని ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల నెదుర్కొంటున్నారు. వారు పరీక్షలను ప్రశ్నాపత్రాల రూపంలోనే కాదు, ప్రభుత్వం రూపంలో, ప్రకృతి రూపంలో, పరిస్థితుల రూపంలో కూడా ఎదుర్కొంటున్నారు.***

నిర్ణీత గడువుకు పరీక్షలు పూర్త యితే ఏ విద్యార్థులైనా ప్రశాంతంగా వుంటారు. తదుపరి చదువుల గురించి ఆలోచిస్తుంటారు. కాని 2020లో టెన్త్ విద్యార్థులకు ఆ ప్రశాంతత లేకుండాపోయింది. రాష్ట్ర విద్యాశాఖ వాళ్ళు ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షాపత్రాలలో పలు మార్పులు చేశారు. దీంతో మారిన విధానంలో విద్యార్థులు పరీక్షలకు తయారు కావాల్సి వచ్చింది. తీరా పరీక్షలు మొదలవుతాయనుకునేసరికి స్థానిక ఎన్నికల కోసమని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలను మార్చి 23కు వాయిదా వేయడం తెలిసిందే! ఆ తేదీ వద్దకు వచ్చేసరికి కరోనా వైరస్ మూలంగా అసలు పరీక్షలనే నిర్వహించకుండా చేశారు.

రెండు నెలలుగా టెన్త్ విద్యార్థులు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వాళ్ళకు పరీక్షలు పెడితే రాసేసి ఫ్రీ అయిపోతారు. ఎట్టకేలకు జులై 10వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఒక్కో సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహి స్తుండేవాళ్ళు. ఇప్పుడు ఒక్కో సబ్జెక్టు ఒక్కో పేపరే... పూర్తిగా కొత్త విధానం. ప్రభుత్వం, ప్రకృతి, పరిస్థితి వంటి పరీక్షలను దాటుకుని వచ్చిన టెన్త్ విద్యార్థులు అసలైన పరీక్షలు ఇప్పుడు వ్రాయనున్నారు. ఈసారైనా అడ్డం కులు లేకుండా వారి పరీక్షలు సాఫీగా సాగిపోవాలని ఆశిద్దాం!

## కావలి సబ్‌కలెక్టర్‌గా ఎంవి సుధాకర్

కావలికి కొత్త సబ్‌కలెక్టర్‌గా ఎంవి సుధాకర్ నియమితుల య్యారు. ఆయన ఈనెల25న కావలి లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు లోని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో డిప్యూటి కలెక్టర్(విజిలెన్స్)గా పని చేస్తున్న ఆయన కావలి డివిజన్ సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీధర్ శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు ఐటి డిఏ పి.ఓగా బదిలీ అయ్యారు.

## ముఖ్యమంత్రికి.. గూడూరు బ్రాహ్మణసేవా సంఘం కృతజ్ఞతలు





కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో దేవాలయాలు మూసివేసినందువల్ల అర్చకులు జీవనభృతి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న సమయంలో అర్చకుల ఖాతాలోకి ఈనెల 26న 5వేల రూపాయలను జమచేసి ఆదు కున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, రాష్ట్రప్రభుత్వానికి గూడూరులోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం కృతజ్ఞతలు తెలియ జేసింది. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గూడూరు శాఖ గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్ రావు, అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ముఖ్య మంత్రికి తమ కృతజ్ఞతలు తెలియ జేశారు. అందుకు కృషి చేసిన ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావుకు, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావుకు కూడా వారు తమ ధన్యవాదాలు తెలిపారు.

## కఠినంగా లాక్‌డౌన్ నిబంధనలు

**- సూళ్లూరుపేటలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు**



నెల్లూరు జిల్లాలో అనేక ప్రాంతాల్లో లాక్‌డౌన్ నిబంధనల్లో సడలింపు ఇచ్చినప్పటికీ... సూళ్లూరుపేటలో మాత్రం కఠినంగా లాక్‌డౌన్ నిబంధనలు అమలవుతాయని, అధికంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడం వంటి ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కలెక్టర్ యం.వి.శేషగిరిబాబు మీడియాకు తెలిపారు. ఇటీవల ఆయన సూళ్లూరు పేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి పర్యటించారు. అక్కడ తీసుకుంటున్న భద్రతా చర్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం సూళ్లూరుపేటలోని క్వారంటైన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులతో కరోనా నివారణ చర్యలపై సమీక్షించారు. ఇప్పటివరకూ సూళ్లూరుపేటలో 75 వరకు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, పాజిటివ్ కేసులు వచ్చిన వారిని కలిసిన కాంటాక్ట్ పర్సన్స్ అందరిని క్వారంటైన్‌కి తరలించి కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు వేగ వంతంగా చేయాలన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో సుమారు 11,000 ఇళ్ల సర్వే ఇప్పటికే నిర్వహించినా, మళ్లీ ఇంటింటి సర్వే నిర్వహించి, 60 ఏళ్ళు పైబడిన వారిని రోజూ స్క్రీనింగ్ చేయాలన్నారు. కరోనా మహమ్మారి నివారణకు ప్రతి ప్రభుత్వ శాఖ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు.



## రైస్‌మిల్లు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్

**- నెల్లూరులో పరిశీలించిన మంత్రి అనిల్**

నెల్లూరు నవాబుపేటలో కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి సంబంధించిన పురాతన, నిరుపయోగంగా ఉన్న రైస్‌మిల్లు, రైతు బజారు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ లేదా గోదాములు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 24వ తేదీన ఆయన మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ వీరి చలపతిరావుతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. మార్కెటింగ్ సొసైటీ 1962లో ఈ ప్రాంతంలో రైసుమిల్లును నిర్మించిందని చెప్పారు. అలాగే అక్కడే రైతుబజారు కూడా ఉండేదని అన్నారు. కాలక్రమంలో నవాబుపేట నివాస స్థలంగా మారడంతో అవి నిరుపయోగంగా మారిపోయాయన్నారు. ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ లేదా గోదాములు నిర్మించే విషయాన్ని పరిశీలిస్తున్నామని ఏదైతే ఉపయోగకరంగా ఉంటుందో దాని నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయా లని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైసిపి నేతలు కిన్నెర ప్రసాద్, తుంగా ఇందుధర్‌రెడ్డి, పుష్పా నారాయణ, కిన్నెర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## తగ్గించేదాకా.. వెనక్కి తగ్గేదే లేదు!

**- విద్యుత్ ఛార్జీలపై సోమిరెడ్డి**




ప్రజలు కరోనా భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని జీవనం సాగి స్తుంటే ప్రభుత్వం మరోవైపు ప్రజలపై విద్యుత్ ఛార్జీల అదనపు భారం మోపడం దారుణమని, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌ఛార్జీలు తగ్గించేవరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చ రించారు. ఈనెల 24న ఆయన నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాల యంలో టిడిపి రూరల్ ఇన్‌ఛార్జి, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో రూరల్ డివిజన్ల నాయకులు కార్యకర్తలతో జరిగిన నిరసన దీక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం ఇష్టానుసారంగా పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ఛార్జీలను తగ్గించని పక్షంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక అనూరాధ, నాయకులు జన్ని రమణయ్య, జలదంకి సుధాకర్, షాబీర్‌ఖాన్, రాజాయాదవ్, ఆసిక్, మురళి, మాతంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయండి

**- సచివాలయ ఉద్యోగులకు జేసీ-3 సూచన**

ప్రభుత్వం ప్రజల కోసం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో క్షేత్రస్థాయిలో ఉండే సచివాలయాల ఉద్యోగులు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన జేసీ-3 ప్రభాకర్ రెడ్డి సూచించారు. ఈనెల 23న కోవూరు మండలంలోని పడుగుపాడు సచివా లయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉద్యోగులు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అనంతరం వివిధ పథకాలను అమలుచేస్తున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దారు సుబ్బయ్య, ఎంపిడిఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### రెడ్‌జోన్‌లో..
## ప్రజల సమస్యలు తీరుస్తాం
### - మునిసిపల్ కమిషనర్ ఓబులేసు



రెడ్‌జోన్ ప్రాంతంలో పర్యటిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఓబులేసు

గూడూరు రెడ్‌జోన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఓబులేసు చెప్పారు. గూడూరు పట్టణంలోని రెడ్‌జోన్ ప్రాంతమైన కోతరూమ్ వీధిలో ఆయన ఈనెల 25న పర్యటించి స్థానికులకు కూరగాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌జోన్‌లో ఉన్న ప్రజలు ఇళ్ళలోనే ఉంటూ నిబంధనలు పాటించాలని కోరారు. దాతల సహకారంతో వారికి నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పొణకా దంపతులకు
## ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు మునిసిపల్ మాజీ ఛైర్మెన్ పొణకా దేవసేనమ్మ తండ్రి ఏటూరి రమణారెడ్డి (94) కావలి వైకుంఠపురంలో ఉంటూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా పొణకా దంపతులను గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, కొడవలూరు ధనుంజయరెడ్డి, 27వ వార్డు మాజీ కౌన్సిలర్ బి.రమేష్, కోదండయ్య తదితరులు పరామర్శించారు.

### 'చేగువేరా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో
## స్వచ్ఛంధ రక్తదానం



గూడూరులోని ఏరియా ఆసుపత్రిలో చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈనెల 22న 30 మంది స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. గూడూరు టౌన్ సిఐ దశరథరామారావు చేతులమీదుగా ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గూడూరులో ఇప్పటివరకు 500 మందితో నిరంతర రక్తదానశిబిరాన్ని నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో నిరుపేద రోగులు, గర్భిణులకు ప్రాణదానం చేస్తున్నారని చేగువేరా ఫౌండేషన్ వారిని కొనియాడారు. అనంతరం సిఐ దశరథరామారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ కార్యదర్శి క్రాంతికుమార్, అన్వర్‌బాషా, మధుసూదనరెడ్డి, పురుషోత్తం, ప్రశాంత్, భాను, వినోద్, మౌనేష్, కిరణ్, చైతన్య, పవన్‌సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికులకు భోజనాలు



గూడూరులోని జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ శైలజ వితరణతో వలస కార్మికులకు ఈనెల 24న భోజనాలు అందజేశారు. జాతీయ రహదారిపై కాలినడకన తమ స్వస్థలాలకు వెళ్తున్న సుమారు 2 వందల మంది వలసజీవులకు వారు తమవంతుగా వెజిటబుల్ రైస్, కోడిగుడ్డు, అరటిపండు, వాటర్‌ప్యాకెట్లు అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ వలస కూలీలకు తమవంతు సేవలందించిన డాక్టర్ శైలజ దాతృత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చంద్ర, మనోహర్, అశోక్, గోపీ, వరప్రసాద్, రాజశేఖర్, రూప్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పేటేటి ట్రస్ట్ సాయం



గూడూరులోని రెడ్‌జోన్‌లలో ఉన్న ఐసిఎస్ రోడ్, కోతరూమ్ వీధి ప్రాంతాల్లోని ప్రజలకు ఈనెల 26న పేటేటి సత్యంనాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైయస్సార్సీపి యువ నాయకుడు పేటేటి చంద్రనీల్ సహకారంతో కోడిగుడ్లను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రెడ్‌జోన్‌లో ఉన్న ప్రజలకు మలివిడతగా పలసరుకులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, చంద్రనీల్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో..
## గిరిజనులకు కూరగాయలు



గూడూరులోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శివకుమార్‌రెడ్డి వితరణతో ఈనెల 24న గూడూరు మండలంలోని చవటపాళెంలో ఉన్న నక్కలవారివీధిలోని వంద మంది గిరిజన కుటుంబాలవారికి వారానికి సరిపడా కూరగాయలు అందజేశారు. సేవాభావం కలిగిన రహీం చేతుల మీదుగా ఈ సాయం పంపిణీ చేశారు. ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, బాలయ్యనాయుడు, రవికుమార్, తిరుమలరావు, ఎం.మస్తానయ్య, గ్రానైట్ ప్రభాకర్, ప్రజేందర్‌రెడ్డి, కరిముల్లా, సివిఆర్ న్యూస్ సతీష్‌తో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.

## పేర్నాటి ట్రస్ట్ పౌష్టికాహారం పంపిణీ



గూడూరులోని 5,6,8 వార్డుల్లో రెడ్‌జోన్‌లలో ఉన్న సుమారు 6వందల కుటుంబాలకు పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఈనెల 25న పౌష్టికాహారం అందించారు. ఆయా కుటుంబాలవారికి అరడజను కోడిగుడ్ల వంతున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మూలి కిషోర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, రాజా, మహేంద్ర, ప్రశాంత్, నాగార్జున, కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. పోషకాహార లోపం వల్ల కరోనా తీవ్రత అధికంగా ఉంటుందని, అందువల్ల ప్రజలకు పౌష్టికాహారం లోపం లేకుండా తమ ట్రస్ట్ తరపున పౌష్టికాహారం అందిస్తున్నామని ట్రస్ట్ నిర్వాహకులు చెప్పారు.

### అబ్దుల్‌కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో..
## నిరుపేద ముస్లింలకు రంజాన్ కానుక



గూడూరులోని డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగ కానుకగా దుస్తులు, పలసరుకులు అందజేశారు. ఏ.డి ఎక్సైజ్ అమీర్‌జాన్, సబ్‌రిజిస్ట్రార్ భానుమతి, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ షాకీర్ (హైదరాబాద్), మయూరి శ్యాంయాదవ్, ఎస్‌కె జాఫర్, అబ్దుల్ రహీం ఆర్థీఏల దాతృత్వంతో పేద ముస్లింలకు ఈ సాయం అందజేశారు. అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ తాజుద్దీన్, సభ్యులు కాలేషా, ఆరీఫ్ పాల్గొన్నారు.

## డాక్టర్ రోహిణి వితరణ



గూడూరు మండలం పురిటిపాళెం సమీపంలోని ఆదిశంకర కళాశాల జాతీయ రహదారిపై వెళ్తున్న వలస కూలీలకు గూడూరులోని డాక్టర్ రోహిణి దాతృత్వంతో అన్నం పొట్లాలు అందజేశారు. ఈనెల 23న ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఆదే రోజు సాయంత్రం బంకిసాహెబ్‌పేట వద్ద పేద ముస్లిమ్‌లకు రెడ్ సంస్థ రాజేష్ సహకారంతో జీవనిరెడ్డి దాతృత్వంతో రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, మల్లాబత్తిన జీవనిరెడ్డి, సుప్రియ, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.



ఆదిశంకర కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై వెళుతున్న వలస కూలీలకు ఫ్రైడ్‌రైస్, మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేస్తున్న 27వ వార్డు మాజీకౌన్సిలర్ బాలిబోయిన రమేష్

## ఆర్‌ఎస్‌ఆర్ ఆధ్వర్యంలో

# విజయోత్సవ వార్షికోత్సవం



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా నెల్లూరులో వైసీపి నేత శ్రీనివాస్ (ఆర్‌ఎస్‌ఆర్) పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక 18, 21వ డివిజన్ల పరిధిలోని వనంతోపు, అరుంధతీ పాళెంలో 450 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైసీపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యి కూరగాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైసీపి ప్రభుత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, మరో 20ఏళ్లు కూడా ముఖ్యమంత్రిగా జగనే ఉంటారని చెప్పారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు

## - అధికారులను ఆదేశించిన జేసీ వినోద్‌కుమార్



నెల్లూరు నగరంలోని నూతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 23న జాయింట్ కలెక్టర్ డా.వి. వినోద్‌కుమార్ పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిబంధనలకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు. నెల్లూరు, నాయుడు పేట, గూడూరు, ఆత్మకూరు డివిజన్‌లలో ప్రస్తుతం ఉత్పత్తి జరుగుతున్న పరిశ్రమల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రూపొందించిన నివేదికలను పరిశీలించారు. తగిన భద్రతా చర్యలు పాటించని పరిశ్రమలను గుర్తించి వారు నిబంధనలు పాటించేలా అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ పరిశ్రమలను తనిఖీ చేసి, అక్కడ కరోనా నివారణకు తీసుకుంటున్న చర్యలతో పాటు కార్మికులు సామాజిక దూరం పాటిస్తూ పనిచేసేలా పరిశ్రమల యజమానులు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలను అధికారులు సందర్శించిన సమయంలో చెక్ లిస్టుకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకున్నారా? లేదా? అనేది పరిశీలించాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే ఆ పరిశ్రమ యాజమాన్యం నుంచి సెల్ఫ్ డిక్లరేషన్‌ని కచ్చితంగా తీసుకోవాలని జేసీ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఏ.పి.ఐ.ఐ.సి జి.ఎం, ఎన్.ఎస్.ఆర్.సి.ఎం. ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## బస్సుల్లో రిజర్వేషన్ చార్జీల తగ్గింపు

ఆర్టీసి నెల్లూరు డిపో-1 నుంచి నడుపుతున్న అన్ని దూరప్రాంత సర్వీసులకు ఈనెల 24వ తేది నుంచి అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునే ప్రయాణీకులకు రిజర్వేషన్ చార్జీ 20 రూపాయలను తగ్గించనున్నామని ఆర్టీసి డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

గల్పిక 989

# భారతీయుల ప్రేమకు కరోనా క్వీన్ ఫిదా!

అది చైనాలోని వూహాన్ నగరంలో గల వైరాలజీ ల్యాబ్. వైరస్ల సృష్టికర్త ప్రొఫెసర్ జింగ్ జపాంగ్ కొత్తరకం వైరస్‌ను సృష్టించడానికి నానా తంటాలు పడుతున్నాడు. అప్పుడు కరోనా వైరస్ ఆయన దగ్గరకొచ్చి... గురూజీ, నన్ను ఈ ప్రపంచం మీదకు వదిలారు కదా... ఏఏ దేశంలో నా ప్రభావం ఎలా వుందో చూడాలనుకుంటున్నాను, నా మూలంగా ఆయా దేశాల ప్రజలు నరకయాతన పడుతుంటే చూసి ఆనందించాలనుకుంటున్నాను. నన్ను పంపిస్తారా అని అడిగింది. అందుకు జింగ్‌జపాంగ్... తప్పకుండా వెళ్లి చూడు. నీకు ఒక ఫ్రీ గెటప్ ఇస్తాను, ఆ గెటప్‌లో అన్ని దేశాలూ తిరుగు.. ఒక్క భారతదేశం మాత్రం వెళ్లకు అని చెప్పి, నీ పేరు ఇకనుండి 'కరోనా క్వీన్' అని పంపించాడు.

కరోనా క్వీన్ తన అంతర్జాతీయ పర్యటనలో భాగంగా తొలుత అమెరికాకు వెళ్లింది. వైట్‌హౌస్‌లోకి జొరబడింది. అక్కడ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన భార్య మెలానియా వున్నారు. ట్రంప్ మూతికి మాస్క్ కట్టుకుని, నేను ఈ మాస్క్‌లోనూ అందంగా కనపడుతున్నాను కదా అని మెలానియాను అడిగాడు. అందుకామె... ఆ మాస్క్ కట్టుకుంటేనే మీరు అందంగా వుంటారు అని పైకి చెప్పి లోపల మాత్రం ఆ మాస్క్ తీస్తే పండు కోతికి, గండు పిల్లికి పుట్టిన గుండు గొరిల్లాలా వుంటారని అనుకుంది. ట్రంప్ ఆ మాస్క్ వున్న మూతితోనే మెలానియాను ముద్దాడబోతే.. ఆమె అతనితో చాల్లేండి సంబరం, ఈ కరోనా సీజన్‌లోనూ ముద్దు ముచ్చట్లు... ఈ కరోనా పోయేదాకా ముద్దు సీన్లన్నీ బంద్ అంటూ మంచమెక్కి ముసుగుతన్నింది. ట్రంప్ నిరాశగా బెడ్ మీద ఇంకో పక్క వాలిపోయాడు. ఈ సీన్ చూశాక కరోనా క్వీన్‌లో ఆనందం వెర్రితలలు వేసింది. నా ఎఫెక్ట్ బాగానే వుందనుకుంటూ అక్కడ నుండి బయల్దేరి బ్రిటన్‌కు చేరింది. కరోనా వచ్చి శారీరకంగా చిక్కిపోయిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చూసి సంబరపడింది. ఇటలీలో వేల సంఖ్యలో కరోనా మృతుల సమాధులను, బ్రెజిల్ ఆసుపత్రులలో లక్షల సంఖ్యలో వున్న కరోనా పేషంట్లను చూసి కరోనా క్వీన్ గర్వంగా తల ఎగరేస్తూ... ఈ ప్రపంచానికి నేనే రాణిని, నన్ను మించిన శక్తివంతులు ఇక లేరు అని మనసులో అనుకుని వెంటనే తన గురువు ప్రొఫెసర్ జింగ్ జపాంగ్‌కు ఫోన్ చేసింది. గురువు గారు అన్ని దేశాలు తిరిగాను... అన్ని దేశాలను కూడా నేను జయించాను, ఇక భారతదేశం ఒక్కటే మిగిలి వుంది. మీరేమో పోవద్దన్నారు, నాకేమో పోవాలని, అక్కడ కూడా నా విజయ యాత్రను ఆస్వాదించాలని వుంది అని చెప్పింది. దానికి జింగ్ జపాంగ్... ఎగ్రస్సాలు చేయకుండా బుద్ధిగా ల్యాబ్‌కు వచ్చేయ్... ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో, భారత్‌కు పోవద్దు అంటూ ఫోన్ పెట్టేశాడు.

గురువు అంత సీరియస్‌గా భారత్‌కు ఎందుకు పోవద్దంటున్నాడు... ఏదో మతలబు వుంది... కనుక్కోవాలి, నావల్ల భారతీయులు నరకం అనుభవిస్తుంటే నేను చూడాలి! పైశాచిక ఆనందం పొందాలి అనుకుని ఇండియా వైపు బయల్దేరింది.

★★★★★

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ జాతినుద్దేశించి ప్రసంగిస్తున్నాడు. కరోనా క్వీన్ కూడా అప్పుడే అక్కడ చేరి ఆయన ప్రసంగాన్ని వినసాగింది. మోడీ మాట్లాడుతూ... ఈ కరోనా వైరస్ మనకు వరం లాంటిది, ఈ వైరస్ మూలంగా తలెత్తిన పరిణామాలను మనం అవకాశాలుగా మలచుకోవాలి, కరోనా వైరస్ ప్రారంభంలో చప్పట్లు కొట్టాం, ఆ తర్వాత లైట్లు ఆపి దీపాలు వెలిగించాం... ఆపైన హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించాం... రేపు బాణా సంచాలు కాల్చి కరోనా విజయోత్సవాలు నిర్వహించండి, కరోనా మనల్ని సంఘటితం చేసింది. కరోనా మనలోని మానవత్వాన్ని తట్టిలేపింది. కరోనా మన బంధాన్ని కలిపింది. ఈ కరోనా మూలంగా తమ మాతృభూమి ముఖం చూడని వాళ్లు విదేశాల నుండి పరుగెత్తుకుంటూ వచ్చి తమ తల్లిదండ్రుల వద్ద వాలారు. ఏళ్ల క్రితం పల్లెటూర్లను వదిలిపోయిన వాళ్లు పుట్టిన వూరిని వెదుక్కుంటూ వచ్చారు. కరోనా మూలంగానే చాలామంది మగాళ్లు ఇంట్లో వంట చేయడం, బట్టలుతకడం, అంట్లు తోమడం, ఇల్లు చిమ్మడం వంటివి నేర్చుకున్నారు. బయట హోటళ్లు మూతపడి ఇంట్లో తిండే తినడం వల్ల చాలామందికి గ్యాస్ ప్రాబ్లమ్, అజీర్తి వంటి రోగాలు కూడా తగ్గాయి. కరోనా వల్లే బ్యూటీ పార్లర్లు మూతపడి తమ భార్యల ఒరిజినల్ రూపాలను చాలామంది భర్తలు తొలిసారిగా చూడగలిగారు. అంతెందుకు, కరోనా వైరస్ వచ్చాకే దొంగతనాలు తగ్గాయి. లైంగిక నేరాలు తగ్గాయి, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి... వసుదైక కుటుంబాలు మళ్లీ ఏర్పడ్డాయి. మన సమాజానికి ఇంత మేలు చేసిన కరోనా వైరస్‌కు మనం కృతజ్ఞతలు తెలపాలి... కాబట్టి దేశ ప్రజలంతా కూడా రేపు మధ్యాహ్నం ఒంటిగంటకు రోడ్ల మీదకొచ్చి ఎర్రటి ఎండలో నిలబడి చప్పట్లు కొడుతూ, చెంబులు, దబర్లు వాయిస్తూ కరోనా వైరస్‌కు కృతజ్ఞతలు చెప్పాలని పిలుపునిచ్చి ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని ముగించాడు. ప్రధాని ప్రసంగమంతా వున్నాక... కరోనాక్వీన్‌కి కన్నీళ్లు ఆగలేదు... ప్రపంచమంతా నన్ను ద్వేషిస్తుంటే, ఈ భారతీయులేంటి, నన్ను ఇంతగా ప్రేమిస్తున్నారు. ఈ మట్టిలోనే ఆ ప్రేమ మాధుర్యం వున్నట్లుంది, నా గురువు జింగ్ జపాంగ్ భారత్‌కు పోవద్దన్నది ఇందుకేనేమో... భారతీయుల ప్రేమాభిమానాలు చూస్తే... నా మనసు మారిపోతుందేమోనని భయపడినట్లున్నాడు. నా చైనా గరువు ఎంతటి దుర్మార్గుడు.. 'ద్వేషం' అన్నది చైనీయుల నుండి నేర్చుకోవాలి, పగవాడిని కూడా ప్రేమించడం భారతీయుల నుండి నేర్చుకోవాలి అని మనసులో అనుకోసాగింది. అప్పుడే మోడీ ప్రసంగం ముగిశాక టీవీలో కరోనా యాడ్స్ రాసాగాయి. కరోనా చీరలు, కరోనా ప్యాంట్లు, కరోనా లడ్డు, కరోనా వడ... అంటూ రకరకాల ప్రకటనలు... కరోనా క్వీన్ మనసులో నన్ను భారతీయులు ఇంతగా సొంతం చేసుకున్నారా? అని మురిసిపోతుండగా హీరో ప్రభాస్ కరోనాపై 'మిర్చి' సినిమాలో సీన్‌ను పేరడీగా చేసిన ప్రకటన రాసాగింది.

'మనుషుల్ని ప్రేమిద్దాం... మహా అంటే వాళ్లు మనల్ని తిరిగి ప్రేమిస్తారు...

ప్రేమిస్తే పోయేదేం లేదు... కరోనాను కూడా ప్రేమిద్దాం... కరోనాతో జీవిద్దాం.. కరోనాతో పయనిద్దాం..'

ఈ స్లోగన్స్‌తో యాడ్ ముగిసింది. కాని ఆ సీన్ చూశాక కరోనా క్వీన్ కళ్ల వెంట నీళ్లు మాత్రం ఆగలేదు. భారతీయుల ప్రేమకు కరోనా ఫిదా అయిపోయి ఇక్కడే వుండిపోవాలనుకుంది.



మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 97వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న నెల్లూరు మూలాపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా తెలుగుదేశం నాయకులు బీద రవిచంద్ర, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టి.రమేష్‌రెడ్డి, టి.అనూరాధ తదితరులు

### తొండూరు కాలనీవాసులకు...

# శ్రీసిటీ చేయూత



చిత్తూరుజిల్లా వరదయ్యపాళెం మండలంలోని తొండూరు సొసైటీ కాలనీ వాసులకు శ్రీసిటీ యాజమాన్యం ఈనెల 23న నిత్యావసర వస్తువులను అందజేసి ఆ పేదప్రజలకు తనవంతు చేయూతనందించింది. ఈ గ్రామంలో అయిదుగురు కరోనా వైరస్ బారినపడగా, అధికారులు ఈ గ్రామాన్ని కంటోన్మెంట్ జోన్‌గా గుర్తించి గ్రామానికి రాకపోకలపై ఆంక్షలు విధించి కరోనా వ్యాప్తి నిరోధానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు సహాయంగా శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 5 కిలోల బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు, శానిటైజర్ బాటిల్ వంతున గ్రామంలోని 225 కుటుంబాలవారికి ఆ సామగ్రినంతా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ సిఐలు జగదీష్‌నాయక్, అశోక్‌కుమార్, శ్రీసిటీ సెక్యూరిటీ ఇన్‌చార్జి రమేష్, పంచాయతి కార్యదర్శి పద్మనాభరాజు, గ్రామ వలంటీర్లు అనిత, నాగభూషణం, మంజుల, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలధర్మం

# సన్నపరెడ్డి రాఘవరెడ్డి



నెల్లూరు విఆర్ కాలేజీలో 36 సంవత్సరాల పాటు ఫిజిక్స్ లెక్చరర్‌గా, ఆ విభాగం అధిపతిగానే కాక, కాలేజీకి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సేవలందించి ఏప్రిల్ 1992లో ఉద్యోగ విరమణ చేసిన సన్నపరెడ్డి రాఘవరెడ్డి మే 26వ తేదీన కోవూరులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. ఆయనకు కుమార్తె కవిత, కుమారుడు శ్రీనివాస నారాయణరెడ్డి ఉన్నారు. ఆయన సతీమణి సుచరితమ్మ 2012లో కన్నుమూశారు.

కోవూరులో రైతుకుటుంబంలో 1932 మే1న జన్మించిన రాఘవరెడ్డి, తల్లిదండ్రులు కమలమ్మ-నారాయణరెడ్డిల ప్రోత్సాహంతో ఉన్నత విద్య చదివారు. కోవూరు, నెల్లూరులో ప్రాథమిక విద్య, కళాశాల విద్య చదువుకుని మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఏ, ఎం.ఏ పూర్తిచేశారు. 1956 నుంచి నెల్లూరు విఆర్ కాలేజీలో భౌతికశాస్త్ర అధ్యాపకునిగా సేవలందించారు. ఉద్యోగ విరమణ తర్వాత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఉమెన్స్ అకాడమీ, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుమారు 18 ఏళ్ళ పాటు పని చేశారు. ఆయన అల్లుడు చేజర్ల శ్రీధర్‌రెడ్డి సినీ నిర్మాతగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కుమారుడు నారాయణరెడ్డి రియల్ ఎస్టేట్ రంగంలో బెంగుళూరులో ఉన్నారు.

రాఘవరెడ్డి మృతికి విఆర్ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు విఎస్ రామచంద్రరావు, సి.సంజీవరావు, వి.నరసారెడ్డి, దేగా రామచంద్రారెడ్డి, డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి, ఎం.కోదండరామిరెడ్డి (యుఎస్ఏ), కె.రవీంద్ర, డాక్టర్ ఎఎస్ జేకబ్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఫిజిక్స్ హెడ్ డాక్టర్ కృష్ణకిశోర్, వివి కృష్ణశర్మ, ఏ.వి రంగారెడ్డి, బి.వేమారెడ్డి, బి.హరిప్రసాద్, శాస్త్రవేత్త ఎం.జగదీష్‌తో పాటు నాన్‌టీచింగ్ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రాఘవరెడ్డి మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!.

# సాహితీ తృష్ణ.. పెరుగు రామకృష్ణ @౬౦



నెల్లూరు సాహితీ చరిత్రలో పెరుగు రామకృష్ణది బలమైన ముద్ర. నిరంతర అధ్యయనం, నిర్విరామ కృషితో సాహితీ వెలుగుబాటలు పరచిన కృషీవలుడు రామకృష్ణ. ఆయన కవిత్వమంతా ఎక్కువగా మనిసి చుట్టూ తిరుగాడుతుంది. మానవత్వంతో పరిఢవిల్లుతుంది. నిజమైన మనిషి కోసం ఆయన అన్వేషణ.

రామకృష్ణ నిరంతరాన్వేషి. అటు తెలుగు సాహిత్యాన్ని, ఇటు ఆంగ్ల సాహిత్యాన్ని జీర్ణించుకుని సాహితీ అభిమానులకు తనదైన శైలిలో కొత్త టానిక్ అందించాడు. ఆయన కవిత్వాన్ని ఆస్వాదించాల్సిందే తప్ప మాటల్లో చెప్పే విధంగా ఉండకపోవడం ఆయన సాహితీ ప్రత్యేకం.

వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగం చేస్తూ కూడా సాహిత్యానికి సమయం కేటాయించి తన ప్రతిభను లోకానికి చాటిన ప్రజ్ఞాశాలి.

కేవలం తెలుగు సాహిత్యానికే పరిమితం కాకుండా ఇంగ్లీషు సాహిత్యాన్ని చదవడంతో బాటు సాహితీయాత్రల్లో దేశ విదేశాలు తిరిగిన అనుభవం వేదికపైన అనర్ఘళంగా మాట్లాడే శక్తిని సంపాదించిపెట్టింది. యూరపు దేశాలైన గ్రీస్, చెక్ రిపబ్లిక్, జర్మన్ మరియు అమెరికా, సింగపూర్, మలేషియా, దుబాయ్, దోహా లాంటి దేశాల్లోనూ వ్యయప్రయాసలకోర్చి పర్యటించడం చిన్నవిషయం కాదు. సాహిత్యం పట్ల ఆరాధన, తపన లేకపోతే అంతటి సుదీర్ఘ ప్రయాణం సాగదు.

రామకృష్ణ నిత్యోత్సాహి. ఎప్పుడూ ఉత్సాహం ఆయన మాటల్లో తొణికిసలాడుతుంది. విస్తృతంగా విశ్వ సంకలనాలకు ఆయన కవిత్వం చోటుచేసుకోవడం అభినందనీయం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా ఉగాది విశిష్ట పురస్కారంతో బాటు అనేక జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

పెరుగు రామకృష్ణ మొదటి కవితా సంపుటి 'వెన్నెల జలపాతం'. ఇది 1996లో వెలువడింది. ఆయన తొలి దీర్ఘకవిత 'ఫ్లెమింగో' రెండు ముద్రణలు వెలువడ్డాయి. ఇది ఆంగ్లంలోకి అనువదింపబడింది. 'నువ్వెళ్లిపోయాక' మరో దీర్ఘకవిత, 2013లో పూలమ్మిన ఊరు, 2017లో ఒక పరిమళభరిత కాంతిదీపం వెలువడ్డాయి. ఇవి తమిళ, హిందీ, ఆంగ్లభాషల్లోకి అనువదింపబడడం విశేషం.

కేంద్ర సాహిత్య అకాడమీ బెంగుళూరు వారిచ్చిన బెంగాలీ కవి చండీదాస్ ప్రేమకవితలను ఇంగ్లీష్ నుండి తెలుగులోకి అనువాదం చేశాడు రామకృష్ణ.

2016లో చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్ నగరం ఆయన విశేష సాహిత్య కృషికి బహూకరించిన డి.లిట్‌తో ఆయన డా. పెరుగు రామకృష్ణ అయ్యారు.

తన 60వ ఏట 2020 మే 31న, జిఎస్‌టి అధికారిగా పదవీ విరమణ గావిస్తున్నారు. ఎంతో పనుల ఒత్తిడిలోనూ విలువైన సాహిత్యాన్ని సృష్టించిన రామకృష్ణ తిక్కన పుట్టిన నేలలో మరింత ఉన్నత సాహిత్యాన్ని సృష్టించి సింహపురి సీమకు గర్వకారణం కాగలరని ఆశిస్తున్నాను.

– చిన్ని నారాయణరావు

# 'మహానాడు'లో జిల్లా నాయకులు



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈనెల 27న అమరావతిలో మొదలైన మహానాడు కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన టిడిపి నాయకులు తమ ఇళ్ళ వద్దనుంచే ఆన్‌లైన్ విధానంలో జూమ్ యాప్ ద్వారా పాల్గొన్నారు. తొలిరోజున 'అన్నదాత నడ్డివిరిచిన ప్రభుత్వం' అనే తీర్మానాన్ని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అదేవిధంగా 'అక్రమకేసులు-ఆస్తుల విధ్వంసం' తీర్మానాన్ని మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రవేశపెట్టాల్సి ఉంది. అయితే సమయాభావం వల్ల ఈ అంశాన్ని మరుసటిరోజుకు వాయిదా వేశారు. నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, తిరుమలనాయుడు, అమృల్లా తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు ఇంటి నుంచే కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దొంగలున్నారు.. జాగ్రత్త!

- ఆరుబయట పడుకుంటే.. ఇంతే సంగతులు
- ఆరు సవర్ల బంగారం దోచుకున్న చోరులు
- పెళ్ళకూరులో ఇదీ సంగతి



ఈ మండే ఎండల్లో ఇళ్ళలో ఉక్కపోత భరించలేక, ఆరుబయట పడుకుంటే మంచి గాలి వచ్చి హాయిగా నిద్రపోవచ్చని బయట మంచాలు వేసుకుని పడుకునే వారికి దొంగలు షాకిస్తున్నారు. ఇదే సందని ఇళ్ళలో దూరి దొరికిందంతా దోచుకుపోతున్నారు. మండల కేంద్రమైన పెళ్ళకూరులో జరిగిందిదే. ఈనెల 26వ తేది రాత్రి మండల కేంద్రమైన పెళ్ళకూరులో ఎస్‌సి కాలనీకి చెందిన ఎం.సుబ్రహ్మణ్యంతో పాటు ఆయన కుటుంబసభ్యులు ఇంటి ఆరుబయట నిద్రపోయారు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి జొరబడి బీరువాలో ఉన్న రెండు సవర్ల బంగారుదండ, మరో రెండు సవర్ల బ్రాస్‌లెట్, ఒకటిన్నర సవర నల్లపూసల దండ దొంగిలించుకుపోయారు. సుబ్రహ్మణ్యం లబోదిబోమంటూ పోలీసులకు ఈ సంగతి ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమ్య వెంటనే చోరీకి గురైన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. అయినా, కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణి కిస్తున్నా, లాక్‌డౌన్‌తో ప్రజలంతా అప్రమత్తంగా ఉన్నా దొంగలు మాత్రం అవన్నీ పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు.

నివాస ప్రాంతాల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని, దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు గట్టి చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# బంగారు, వస్త్ర, చెప్పుల దుకాణాలకు అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్ నిబంధనలను సడలిస్తూ ఈనెల 26 న సర్క్యులర్ జారీ చేసింది. బంగారం, వస్త్ర, చెప్పుల దుకాణాలకు అనుమతిచ్చింది. చిన్న దుకాణాలకు, స్ట్రీట్ ఫుడ్ పార్శిళ్ళకు కూడా అనుమతి ఇచ్చింది. దుకాణాల్లో పనిచేసే సిబ్బంది గ్లౌస్‌లు, మాస్క్‌లు తప్పక ధరించాలి. షాపుల వద్ద ఆరడుగుల భౌతిక దూరం పాటించాలి. దుకాణాలను ప్రారంభించేందుకు పంచాయితీ కార్యదర్శి, తహసీల్దార్, ఆర్డీఓ, మునిసిపల్ కమిషనర్ల అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వం అనుమతించని దుకాణాలు తీస్తే పోలీసులు వాటిని మూసివేసి కేసులు నమోదు చేసే అవకాశం వుంది.

# అమ్మాలన్నదెవరు?.. ఆపిందెవరు?

(మొదటి పేజీ తరువాయి)

ధార్మిక పనులకు కాకుండా ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తే తప్పే!

**సమీక్ష చేశారు..**

2016లో పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత టిటిడి పాలకవర్గం పునఃసమీక్ష చేసింది. ఒకవేళ నిరర్ధక ఆస్తులను వేలం వేసినా వచ్చిన డబ్బును టిటిడి కార్పస్ ఫండ్‌కు జమ చేయాలని ప్రస్తుత పాలకమండలి నిర్ణయించింది. అయితే దీనిపై పెద్ద రాద్ధాంతం చేసి ఉద్యోగులకు జీతాలివ్వలేక స్వామివారి ఆస్తులు అమ్మేస్తున్నట్లు ప్రచారం పుట్టించారు. కాని, టిటిడి నిరర్ధక ఆస్తులను అమ్మాలని చంద్రబాబు ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాన్ని నేటి జగన్ సర్కార్ రద్దు చేసి శ్రీవారి పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకుంది.

**సెంటిమెంట్ రెచ్చగొట్టడానికా?**

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి క్రైస్తవుడు కాబట్టి ఆయనపై హిందూ ద్వేషి అన్న ముద్ర వేయాలన్నది తెలుగుదేశం అధినేత ప్లాన్. ఆయన పచ్చ మీడియా కూడా అందుకు బాగానే సహకరిస్తోంది. జగన్ క్రైస్తవుడు అయినప్పటికీ శ్రీవారి పట్ల భక్తిశ్రద్ధలతో వుంటాడు. తిరుమలను ఎంతో పవిత్రంగా భావిస్తాడు. సుబ్రహ్మణ్య స్వామి చెప్పినట్లు చంద్రబాబు హయాంలోనే టిటిడిని భ్రష్టు పట్టించే ప్రయత్నాలు జరిగాయి. పార్టీ దీక్షలకు టిటిడి నిధులను వాడుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. జగన్మోహన్‌రెడ్డి క్రిస్టియన్ కాబట్టి ఆయనపై దుష్ప్రచారం చేయడానికి టిటిడి ఒక అంశంగా దొరుకుతోంది. ఈరోజు బీజేపీవాళ్ళు కూడా రచ్చచేస్తున్నారు. 2016లో చంద్రబాబు హయాంలో టిటిడి నిరర్ధక ఆస్తులు అమ్మాలన్న నిర్ణయం తీసుకున్నప్పుడు అప్పటి పాలకమండలిలో బీజేపీ వాళ్ళు కూడా సభ్యులుగా వున్నారు. ఆనాటి దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు బీజేపీ ఎమ్మెల్యేనే! మరి ఆరోజు వీళ్లేమన్నా నిద్రపోయారా? లేక టిటిడి ఆస్తుల రక్షణ బాధ్యత అధికారం కోల్పోయాక గుర్తుకొచ్చిందా?

**స్వామి నిధులు కాపాడింది వై.వి.**

తెలుగుదేశం ప్రభుత్వంలో నిబంధనలను తుంగలో తొక్కి, కమిషన్‌లకు కక్కుర్తిపడి 1300 కోట్ల టిటిడి నిధులను ప్రైవేట్ బ్యాంక్ అయిన 'ఎస్' బ్యాంకులో డిపాజిట్ చేశారు. కొన్నినెలల క్రితం ఆ బ్యాంకు ఎత్తిపోయే పరిస్థితుల్లో వుండగా ప్రస్తుత పాలక మండలి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి అప్రమత్తమై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఒత్తిళ్ళు తెచ్చి, ఆ బ్యాంకులో వున్న 1300 కోట్ల నిధులను వెనక్కి తెప్పించి సేఫ్‌లో వుంచారు. ఆయన అప్రమత్తం కాకపోయి వుంటే స్వామివారి హుండీలో వేసిన నిధులు, 'ఎస్' బ్యాంకు హుండీలోకి పోయినట్లయ్యేవి.

చంద్రబాబు తన రాజకీయ వికృత క్రీడకు పవిత్ర క్షేత్రాలను, భక్తుల విశ్వాసాలను ఆటస్థలంగా మార్చుకోవడం విచారకరం. ఏడుకొండల వెంకయ్య ఆస్తుల జోలికెవరూ పోరు... అంత ధైర్యం కూడా ఎవరూ చేయరు? అనవసరంగా ఈ కంపు రాజకీయాల్లోకి ఆయనను లాక్కుపోతే మేలు.

# బాబు హోదా గల్లంతే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలే ముగ్గురు వున్నట్లు సమాచారం. జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చివుంటే వీళ్లు ఇప్పటికే వైసిపి కండువాలు కప్పేసుకునేవాళ్ళు. కాని, జగన్మోహన్‌రెడ్డి వారిని పార్టీలోకి తీసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. జగన్ ఇంతకుముందే చెప్పివున్నాడు... ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి రావాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాలన్నది కండీషన్. కాని వైసిపిలో చేరాలనుకుంటున్న ఎమ్మెల్యేలు తమ పదవులను వదులుకోవడానికి సిద్ధంగా లేరు. దీని మూలంగానే వాళ్లు టిడిపిని వీడి ప్రత్యేక గ్రూపుగా వుండడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చంద్రబాబులా ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనకూడదని జగన్ పాటిస్తున్న నైతిక విలువ వల్లే చంద్రబాబుకు ఈరోజుకీ ప్రతిపక్ష నేత హోదా మిగిలివుంది. జగన్ విలువలు తీసి పక్కనపెడితే బాబు ప్రతిపక్ష నేత హోదా హుష్‌కాకే!

## వలస పేదలకు 'సన్నిహిత' సేవలు

దూరప్రాంతాల నుంచి తమ స్వస్థలాలకు నడిచి వెళ్తున్న నిరుపేద వలస కార్మికులకు నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డు వద్ద స్థానిక 'సన్నిహిత సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఈనెల 27 అల్పాహారం పంపిణీ చేశారు. సునీల్ కుమార్, భాస్కర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మాస్కులు

నెల్లూరు విజ్ఞానభారతి సేవా సమితి, వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న జయభారత్ ఆసుపత్రి వద్ద పలువురు పేదలకు, జర్నలిస్టులకు కూరగాయలు, మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. జయభారత్ ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్, విజ్ఞానభారతి సేవాసమితి ప్రతినిధి సుబ్బరాజు పాల్గొన్నారు.

# అరాచకాలను ప్రశ్నిస్తే... దాడులా?

**- వైకాపా నాయకులపై టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు అమ్ములా ధ్వజం**



ప్రశాంతమైన నెల్లూరులో వైయస్సార్సీపి అరాచకాలు, భీభత్సాలు సృష్టిస్తోందని, వారి అరాచకాలను ప్రశ్నించినందుకు తమ నాయకులపై దాడులు చేస్తున్నారని, ఇదేం న్యాయమని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్ములా ధ్వజమెత్తారు. ఈనెల 27న ఆయన నెల్లూరు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలపై దాడులను ప్రశ్నించినందుకు టిడిపి నగర పార్టీ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై మంత్రి అనిల్ డైరెక్షన్‌లో వివాదాస్పదమైన రీతిలో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కోటంరెడ్డి పోరాటాలు చేసే సమయానికి పుట్టివుండని వాళ్ళు కూడా ఇప్పుడు కోటంరెడ్డిపై విమర్శలు చేస్తుండడం హాస్యాస్పదమన్నారు. కోటంరెడ్డి ఫోన్‌కాల్ హిస్టరీతో జిల్లా ఎస్పీ వద్దకు వస్తామని, మీకు అలా వచ్చే దమ్ముందా అని మంత్రి అనిల్‌ను, రూప్‌కుమార్‌యాదవ్‌లను ఉద్దేశించి ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు దత్తాత్రేయయాదవ్, నవీన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సాయికిషోర్, శరత్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఉగాది!

(మొదటి పేజీ తరువాయి)

చేరింది. ఈ దశలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికార పీఠమెక్కాడు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీలేమో కొండలా వున్నాయి. ఖజానా ఏమో ఖాళీగా వుంది. ఇచ్చిన హామీలన్నీ జగన్ నెరవేర్చగలడా? అని అప్పట్లోనే ఎన్నో సందేహాలు! కొన్ని హామీలనైనా పక్కన పెట్టేస్తాడని చాలా మంది భావించారు.

కాని, ఇచ్చిన హామీల అమలులో జగన్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ముఖ్యంగా ఈ తొలి ఏడాదిలో అయితే సంక్షేమ పథకాల జాతరగానే వుంది. అన్నిరకాల పింఛన్‌లను పెంచడం, చెప్పిన సమయానికి రైతు భరోసా, లక్షలాది వాలంటీర్ ఉద్యోగాలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల నియామకం, చేతివృత్తుల వారికి ఏడాదికి పదివేలు, ఆటోవాలాలకు పదివేలు, విద్యాదీవెన క్రింద ఖాతాల్లోకే నిధులు, వైయస్ కంటి వెలుగు పథకం ద్వారా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు, అగ్రిగోల్డ్ బాధితులకు నిధుల మంజూరు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి మరికొన్ని వ్యాధులు తీసుకురావడం, రైతు నేస్తం, వైయస్ఆర్ లా నేస్తం, దిశ చట్టం, జగనన్న వసతి దీవెన, అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు వేతనాలు, డ్వాక్రామహిళలకు వడ్డీలేని ఋణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రింద తల్లుల ఖాతాలకే డబ్బు చెల్లించడం, మద్యపాన నిషేధం దిశగా పలు చర్యలు... ఏడాది కాలంలో ఎటువంటి అనుభవం లేకుండా ఒక యువ ముఖ్యమంత్రి ఆచరణలో చూపించిన నిజాలు ఇవి! అసలు నిధులు ఎక్కడ నుండి వస్తున్నాయో ఎవరికీ అంతుబట్టడం లేదుగాని చెప్పిన టైంకు సంక్షేమ పథకాల అమలు జరిగిపోతోంది. నిధుల కొరత అనే కారణంతో ముఖ్యమంత్రి ఏ సంక్షేమ పథకాన్ని కూడా వాయిదా వేయడం లేదు. టైం టేబుల్ ఇచ్చి మరీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

ఈ కరోనా కాలంలో కూడా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేవలం కరోనా నివారణ చర్యలపైనే దృష్టి పెడితే వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం అటు కరోనా నియంత్రణ చర్యలను సమర్ధవంతంగా తీసుకుంటూనే, ఇంకోపక్క కొత్త సంక్షేమ పథకాలను పట్టాలపైకి ఎక్కిస్తూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతి కుంటుపడకుండా మరోపక్క అన్నిరకాల లావాదేవీలకు పచ్చజెండా వూపుతూ... తన పని మాటల్లో, మీడియాలో కంటే చేతల్లో ఎక్కువుగా వుంటుందని నిరూపిస్తున్నాడు.

# విజేతలమవుతాం

ఓ కొండచరియ
పెళ్ళుమని విరిగి కూలిన సందర్భం
ఓ ప్రవాహం చలనరహితంగా మారి
నిశ్శబ్దమైన దృశ్యం
ఓ సముద్రం అలలు స్తంభించి
వేదనామయ స్రవంతిలోకి
నెట్టబడిన భీభత్సం
స్మశానాలు ఒళ్ళు విరుచుకుంటున్న
సమూహ ధ్వని
మృత్యువు ఎక్కడో కిసుక్కుమన్న
పరిహాసం
ప్రజల మనసుల్లాగే చెట్లు
వీచడం లేదు
ఒంటరిగా పొరల సొరంగాల్లో
నిర్వేదంతో దాక్కొన్న మనుషులు
నిస్తేజంతో ఉనికిని కోల్పోయి
భీతిగొల్పేలా రహదారులు
ఈ అవని మళ్ళీ ఆకుపచ్చ చిగుర్లు
తొడిగేదెప్పుడు?
ఈ అమావాశ్యకు, అశాంతికీ
స్వస్తి చెప్పాలి
మానవసంచారంలో ప్రాణవాయువు
పురుడు పోసుకోవాలి
గేట్లు ఎత్తేశాక
ప్రవాహ ఉధృతిని ఊపిరులు
ఆవిరులు కాకుండా
మనిషి ముళ్ళకంచె కప్పుకోవాలి
దీపం ఆరిపోకుండా
స్వీయ రక్షణ కవచం తొడుక్కోవాలి
అప్పుడే మన వెనకాల జీరాడే
తెల్లవస్త్రాన్ని తరిమికొట్టిన వాళ్ళమవుతాం
భావితరాలకు మార్గనిర్దేశనం
చేసిన వాళ్ళుగా
విజేతలమవుతాం!..



**- చిన్ని నారాయణరావు**
9440202942

# కరోనా నుంచి.. కోలుకుంటున్నారు

## • వైద్య సిబ్బంది కృషి ఫలిస్తోంది • ఇప్పటిదాకా 155 మంది డిశ్చార్జి

***జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 233 మంది కరోనా వ్యాధి బారిన పడగా, ఈనెల 27వ తేది నాటికి 155 మంది బాధితులు పూర్తిస్థాయిలో వైద్యచికిత్సలు పొంది క్షేమంగా ఇళ్ళకు వెళ్ళడం ఎంతో శుభపరిణామం. వైద్యసిబ్బంది, నర్సులు, ఇతర అధికారులు నిర్విరామంగా చేస్తున్న సేవలు ఫలిస్తుండడం ఎంతో హర్షణీయం. ఇలా ఎంతోమందిని ఈ కరోనా నుంచి రక్షిస్తున్న వైద్యులకు, వైద్యసిబ్బందికి, అధికారులకు రోగులు రెండు చేతులెత్తి నమస్కరించి కృతజ్ఞతలు చెప్తూ, ఆనందబాష్పాలు రాలుస్తూ ఇళ్ళకు క్షేమంగా వెళ్తున్నారు.***




కరోనా మహమ్మారితో బాధపడుతున్న రోగులు వైద్యచికిత్సలు పూర్తి చేసుకుని ఎట్టకేలకు క్షేమంగా ఇళ్ళకు వెళ్తున్నారు. కంటికి కనిపించని కోవిడ్-19 అనే సూక్ష్మజీవి ప్రపంచాన్ని వణికిస్తోన్న ఈ భయానక తరుణంలో ఎంతోమంది ధైర్యంగా వైద్యచికిత్సలు చేయించుకుని ఈ వ్యాధి నుంచి కోలుకుంటుండడం ఒక అద్భుతం. వైద్య సిబ్బంది నిరంతర కృషి, ఇతరత్రా అధికారులు చేస్తున్న సేవలు బాగా ఫలిస్తుండడంతో జిల్లాలో ఈ వ్యాధి నుంచి పూర్తిస్థాయిలో కోలుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కరోనా వ్యాపించకుండా లాక్‌డౌన్ పాటించేందుకు పోలీసు సిబ్బంది చేస్తున్న కృషి కూడా అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఒకవైపు కరోనా పాజిటివ్ కేసులు జిల్లాలో పెరుగుతున్నప్పటికీ, అదే స్థాయిలో ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉండడం విశేషం. ఈనెల 27న నెల్లూరు పెద్దాసుపత్రిలోని ఐసొలేషన్ వార్డులో చికిత్సలు పొందుతున్న వారిలో 11 మంది కోలుకుని ఆరోగ్యంగా ఇళ్ళకు వెళ్లారు. జిల్లాలో ఈ వ్యాధికి గురైన 8నెలల చిన్నారి నుంచి 60ఏళ్ళ పైబడిన వృద్ధుల దాకా ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించుకుని క్రమేణా కరోనాను జయిస్తున్నారు. ఇదంతా ఆ వైద్యసిబ్బంది చలవే. ఐసొలేషన్‌లో చికిత్సలు పొందినవారికి 9వ రోజున కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఫలితాల్లో నెగటివ్ అని తేలితే 10వ రోజు పూర్తయిన తర్వాత డిశ్చార్జ్ చేస్తున్నారు.

### రోగుల్లో మానసిక ధైర్యం నింపుతున్న వైద్యసిబ్బంది...

వైద్యసిబ్బంది అహరహం చేస్తున్న సేవలు ఫలిస్తుండడంతో వైద్య వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. వైద్యులు, ఇతరత్రా వైద్యసిబ్బంది అందరూ వ్యాధితో భయపడుతూ వచ్చిన కరోనా రోగుల పట్ల ఎంతో ఆదరం చూపుతూ, ఆత్మీయతతో వ్యవహరిస్తూ, వారిలో మానసిక ధైర్యాన్ని నింపుతున్నారు. వారికి చికిత్సలు చేసి కోలుకునేలా నిరంతర వైద్యసేవలు అందిస్తున్నారు. కరోనా నుంచి తమను రక్షిస్తున్న వైద్యసిబ్బందికి, నర్సింగ్ సిబ్బందికి, ఇతర అధికారులకు రోగులు రెండు చేతులెత్తి నమస్కరించి కృతజ్ఞతలు చెప్తూ, ఆనందబాష్పాలు రాలుస్తూ ఇళ్ళకు క్షేమంగా వెళ్తున్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి వైద్యసిబ్బంది కరోనాతో పోరాడుతున్నారు.


## శ్రద్ధాంజలి



మా పెద్దదిక్కు, మా ఇంటి వెలుగు

**శ్రీమతి కోర్సపాటి సీతమ్మ గారు**

(స్వర్గీయ కోర్సపాటి గోపాలరెడ్డి గారి సతీమణి)

తే. 20.05.2020 బుధవారం పరమపదించినారు.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారుడు:
**కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి, USA**

కోడలు:
**కోర్సపాటి శైలజ**

కుమార్తెలు - అల్లుళ్ళు
**మోసూరు హైమావతి - మోసూరు షణ్ముగంరెడ్డి**
**ఇసనాక శ్యామల - ఇసనాక జనార్ధన్‌రెడ్డి, USA**
**చేవూరు జ్ఞానప్రసూన - చేవూరు కృష్ణారెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమడు**

**ఉత్తరక్రియలు:** వారి ఉత్తరక్రియలు తేది.03.06.2020 బుధవారం ఉదయం 10.00గంటలకు పాతబిట్రగుంటలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com